శ్రీ

# తాళ్ళపాక పాటలు

## ఈసంపుటములోని పదములకాధారమైన రాగములకు అకారాది క్రమమగు లక్షణవివరణము.

### ౧. ఆహిరి

దీనికి ప్రాచీననామము 'ఆభీరి' అని కానవచ్చుచున్నది. మతంగుని 'బృహద్దేశి' లో ఇది గ్రామరాగములలో నొకటైన మాలవకైశికరాగమునకు 'భాష' గా స్వీకరింపఁబడినది. 'భాష' అనగా మాండలికమైన, లేక ఒకజాతికి చేరిన మార్పుగల రాగము. ఆభీరులు గొల్లవారు. వారు శాస్త్రీయమైన మాలవకైశికరాగమును కొన్నిమార్పులు చేర్పులుచేసి వాడుచుండిరి గాఁబోలు. కనుకనే అది "ఆభీరి" యైనది. దానిప్రాకృతరూపము "ఆహిరి". ఆహిరి, ఆహారి అనురూపములును గలవు. శబ్దరూపమువలె రాగస్వరూపముకూడ ఎన్నోతీరుల మారినది. ఆ అసలు 'ఆభీరి' కూడ 'ఆభేరి' అనుమార్పుతో ఇంకను నిలిచియున్నది. త్యాగయ్యగారి 'నగుమోము' అనుకృతి యీ 'ఆభేరి' రాగమును పట్టుకొన్నది.

ఆహిరి సంపూర్ణరాగము. అనఁగా సప్తస్వరములు మాత్రమేకాక వాని వికారములగు ఇతరస్వరములన్నియును, ఒకతీవ్రమధ్యమము తప్ప, ఇందు ప్రయోగింపఁబడును. కనుకనే దీని ఏమేళములో చేర్పవలయునన్న విషయములో ఎన్నో భిన్నాభిప్రాయములు బయలుదేరినవి. రామామాత్యుని దృష్టిలో తీవ్రఋషభము, సాధారణగాంధారము, శుద్ధమధ్యమము, కోమలధైవతము, తీవ్రతరనిషాదము, షడ్జపంచమములును ఈ రాగములో ప్రధానముగాఁ గానవచ్చినవి. కనుక ఈరాగమునే మేళముగా అతఁడు గ్రహించెను. గోవిందదీక్షితుఁడు, వెంకటమఖియును ఇట్లే స్వీకరించినను నిషాదమును కాకలిగా గ్రహించిరి. కాని వెంకటమఖియే రచించినట్లు చెప్పఁబడు రాగలక్షణానుబంధములో ఇది రీతిగౌళ (నటభైరవి) మేళములో చేర్పఁబడినది. అనఁగా నిషాదము కైశికిగానే ముఖ్యముగా గ్రహింపవలెననుట. ఇట్లే ఇందలిఋషభమును కోమలముగానే స్వీకరించి కొందరు తోడిమేళమున చేర్చిరి. మఱికొందరు గాంధారము

తీవ్రముగానే వినవచ్చుట గ్రహించి వకుళాభరణ మేళమున కలిపిరి. మొత్తముమీఁద విమర్శగా లక్షణము నిర్వచింప సాధ్యముగాని రాగములలో ఇది ప్రధానముగాఁ గానవచ్చుచున్నది.

కాని త్యాగరాజు, దీక్షితులు మొదలగు ఆధునిక వాగ్గేయకారుల లక్ష్యములు సాంప్రదాయికముగా పాడునట్టి పద్ధతినిబట్టి యిప్పటికి దీనిని ఒకస్థూలలక్షణమునకు లోపఱుపవచ్చును. 'సంగీతసంప్రదాయప్రదర్శిని' లో సుబ్బరామదీక్షితులు లక్ష్యే చేసిరి దాని ప్రకారమే యీ లక్షణ వివృతి :— -

స రి స గా మ ప ధ ని స – సా ని ధా ప మ గా రి స

ఇది సామాన్యముగా ఆరోహావరోహములు. సరిస అను ప్రయోగము చూపుట చేత ఋషభమెక్కువగా షడ్జము నాశ్రయించియే కోమలముగా ధ్వనించుననుట సూచితము. దానిని కంపితగమకముతో స రి స రి స రి అట్లు తప్ప స్వస్థానమున శుద్ధముగా పట్టరాదనుట. గాంధారమును దీర్ఘముగా, మధ్యమముతో చేర్చి కంపితగమకముతో పలికింపవలయును. అట్లు చేయునపుడు సాధారణముగాను అంతరముగాను అది ధ్వనించును. మధ్యమము షడ్జపంచమములవలె ప్రధానస్వరమై స్వస్థానమున స్ఫురింపవలసినది. ధైవతము ఆరోహణములో దుర్బలమైన అనువాది; నిషాదమును అందుకొనుటకుమాత్రము పనికివచ్చును. కనుక 'ప ధ నీ' అన్నప్పుడు శుద్ధముగాను చతుశ్శ్రుతిగాను యథాసంభవముగా స్ఫురించును. ఈ రాగమునకు స్వరూపమునిచ్చు స్వరము నిషాదమే ఆరోహములో 'ప ధ నీ స' అన్నప్పుడు షడ్జముతో చేరి ఆస్వరము ఊగుచు, కైశికి, కాకలి మాత్రమే కాక చ్యుతషడ్జముగాను పలుకవలసియుండును. అవరోహణములో 'సా ని ధా ప' అన్నప్పుడు 'సా ని నీ (ధ ధ ని ధా ప' అని స్పష్టమైన కైశికిస్వరూపమును మున్నిడుకొని పలుకును. అప్పుడు 'ధ ని' లోని ధైవతము కోమలముగాఁగాని చతుశ్శ్రుతిగాఁగాని స్ఫురింపవచ్చును 'ధ ప' అన్నప్పుడు మాత్రము శుద్ధమే రి గ ధ ని స్వరములలో ఏదిగాని షడ్జపంచమ మధ్యమములలో దేనిలోనైనను విశ్రాంతి పుచ్చుకొనవలసినదే తప్ప స్వతంత్రముగా విన్యాసస్వరము కాఁగూడదు. ప మ గా రి అని దిగునప్పుడు గాంధారము మధ్యమమును తాఁకి ఋషభమునకు దిగును. రిస్వరము షడ్జాశ్రితముగానే తూఁగి దిగును. చతుశ్శ్రుతి ఋషభమునకు ఈ రాగస్వరూపములో చోటు కల్పింపబడియే గొప్పదియే. 'ప రి స' అను సంచారములో కంపము సంవాదమునుబట్టి తీవ్రఋషభము

స్ఫురింపవచ్చును. అట్లే 'ప ధ ని స రి' అను నడకలో ధైవతమును తీవ్రముగా చూపి ఋషభమునుగూడ ధైవతసంవాదధర్మముచేత మీఁదికెత్తవచ్చును. 'ఈ రాగము అనుభవవేద్యము' అన్న సుబ్బరామదీక్షితులమాట గమనింపఁదగినది. పార్శ్వనాథుఁడు దీనిని 'గరిష్ఠః' అనియెను!

## ౨. కన్నడగౌళ

దాక్షిణాత్య సంగీతపద్ధతిలో కన్నడ-కర్ణాట శబ్దములతోఁ గూడిన రాగములనేకములు వెలసినవి. భరతముని కాలములో 'ఆంధ్రి' ప్రసిద్ధముగా జాతిరాగమై యుండెను; గాని తరువాత కర్ణాటులసంబంధమునే రాగనామములెక్కువగా సూచించును. అసలీపద్ధతికే నేఁటికి కర్ణాటకపద్ధతి అను పేరువచ్చినదిగదా. మతంగుని కాలమందు కర్ణాటరాగముగలదు. కర్ణాటకమును ప్రత్యేకమేళముగా తరువాతివారు గ్రహించిరి. అది యిప్పటి హరికాంభోజికి, ఖరహరప్రియకు, మధ్యవర్తిగా ఉండియుండునని పండితులూహించుచున్నారు. ఇట్లే గౌడపద్ధతియొకటి ఈ సంప్రదాయములో కలిసినది. కర్ణాటక మేళమును గౌడులు వాడుకొనుచుండిరి. రీతియే కర్ణాట గౌళ-కన్నడగౌళ-కావచ్చును. ఈ రాగము 'ఉత్కలానామతిప్రియః' అని రామామాత్యుఁడు చెప్పెను. పార్శ్వనాథుఁడు 'ప్రతాపరాజు' దీనిని సృజించినట్లు చెప్పెను. ఓఢ్రదేశపు 'ప్రతాప' నామముగల రాజులలో ఎవరో దీనిని ఎక్కువ ప్రచారమునకు తెచ్చినట్లు మనమూహింపవచ్చును. వెంకటమఖి-గౌళ, కేదారగౌళ, ఛాయాగౌళ, రీతిగౌళ, పూర్వగౌళ, నారాయణగౌళ, కన్నడగౌళ - అని సప్తగౌళలను పేర్కొన్నాఁడు.

దీని స్వరూపమునుగూర్చి పలు మతభేదములు గలవు. రామామాత్యుఁడు షడ్జ మధ్యమ పంచమములు శుద్ధములు, ఋషభము షట్ఛ్రుతి, ధైవతము పంచశ్రుతి, కైశికి నిషాదము, తీవ్రతరగాంధారమును దీనియందు వచ్చునన్నాఁడు. నిషాదము కాకలి, ధైవతము షట్ఛ్రుతిగానుండవలెనని గోవిందదీక్షితుని మతము. అతనికుమారుఁడు వెంకటమఖి రి-ధలు రెండును పంచశ్రుతులేయని, గ-ని లు సాధారణ కైశికులేయని ఇంకను సవరించినాఁడు. ఇంక స్వరక్రమములో రామామాత్యుఁడును వెంకటమఖియు, ఆరోహములో క్వచిత్తుగా మధ్యమమును వదలవలెనన్నారు. తక్కినప్పుడు సంపూర్ణస్వరసంచారము.

కాని యిప్పుడట్లు లేదు. త్యాగయ్యగారి 'ఒరులాపు' 'సాగనుజాడ' అను కృతులలో ఈ రాగము షడవక్రియా రాగమై, స రి గ మ ప ని స - స ని ధ ప మ

గ స - ధ మ పా మ, అను సంచారముతో వెలసినది. ముత్తుస్వామిదీక్షితుల 'నీలోత్పలాంబికయా' అను కీర్తనలోను ఇట్లే. కనుక ఆమార్గమునే ఆశ్రయించి, గ రి గ, ని ధ ని, ధ ని ప, స ని ప ఇత్యాది విశేషప్రయోగముల నంగీకరించి ఇప్పటివండితులు పాడుచున్నారు. 'గ పా' అను పూర్వాంగమునకు సంవాదిగా 'ని పా' అని యుత్తరాంగములో ప్రయోగించినను, 'రి గ మా' కు సరిగా 'ధ ని సా' అని ప్రయోగించినను రాగస్వరూపము చెడదు. 'గ పా' అను మధ్యమము వదలిన ప్రయోగము పూర్వముండినది, రాగమందలి తక్కిననడకలతో సంవాదములేమిచే అంతరించినది. గ - మ - ని స్వరములు ప్రాయశః శుద్ధముగా జంటలుగా ప్రయోగించుట రాగస్ఫూర్తినిచ్చును. రిషభధైవతస్వరములలో విన్యాసము చేయరాదు.

## 3. కాంభోజి

తెలుఁగువారికి విశేషించి ప్రియమైనరాగము. రామరాజభూషణుఁడు - సంగీతకళారహస్యనిధి - గిరికాదేవి విరహవేదన విలాపములో దీని మార్దవదైన్యాదిభావములను చవిచూచినవాఁడు. దీని 'గాంభీర్యము' నకు మరులై కవిచౌడప్ప ఇంతటిదింకొకటి లేదన్నాఁడు. కర్ణాటగాయకులందఱును దీనిని గ్రహించి పెంచినారు. కాని తెలుఁగువారిదే ఒక విశిష్టపద్ధతి యీరాగమునందు ఉండినట్లున్నది. తాళ్ళపాకవారిపదాలలో కొన్ని 'తెలుఁగుకాంభోజి' వి ఉన్నవి. అన్నమాచార్యులకు సమకాలీనుఁడో ఇంచుక పూర్వుఁడో అయిన 'నిజగుణశివయోగి' తన 'కైవల్యపద్ధతి' అను కన్నడ పాటలగ్రంథములో ఈరాగము నుపయోగించుకొన్నాఁడు. అచ్చపు తెలుఁగుజాతి వారగు 'ఎరుకల' వారు దీనిని ప్రత్యేకముగా అనుగ్రహింపఁగా 'ఎరుకలకాంభోజి' సిద్ధమైనది. 'తెలుఁగుకాంభోజి' అదే కాఁగలదు. 'ఎరుకల'కు అర్థము తెలియక అనాంధ్రవిద్వాంసులు దానిని 'యదుకుల' గా సంస్కరించుకొన్నారు. ఇప్పుడదే పేరు దానికి నిలిచినది, అర్థము లేకున్నను అందమున్నది గనుక. హిందూస్తానీవారి 'తిలక్ కామోద్' దాని వేషాంతరమే - నామరూపములలో. అందలి 'తిలక్' మూలమైన 'తెలుగు' ను స్పష్టముగా సూచించుచున్నది.

ప్రాచీనరాగము. మతంగుని 'బృహద్దేశి'లో, పాల్కురికి సోమన్న 'బసవపురాణ' మందలి రాగపట్టికలో, పార్శ్వదేవుని 'సంగీతసమయసారము'లో దీనియుల్లేఖము కలదు. రామామాత్యుని లక్షణములో దీని స్వరూపము కొంత స్పష్టపడినది. అతని మతమున ఇదొక మేళరాగము. పంచశ్రుతులుగల రి - ధలు, అంతరగాంధారకాకలీనిషాదములు, శుద్ధ స - మ - ప స్వరాలును గలవి. ఆరోహణమున మధ్యమ నిషాదస్వర

ములు విడువవలసినవి. అనఁగా 'సరిగమధస - సనిధపమగరిస' అని సంచారము. అప్పటికది ఇప్పటి బిలహరి రాగమగును. సోమనాథుఁడు ఇవే స్వరాలుగల యీమేళమే పేర్కొని నిషాదమునుమాత్రము వికల్పముగా వర్జించవచ్చునన్నాఁడు. కాని అతఁడిచ్చిన లక్ష్యములో నిషాదమును పూర్తిగా వదలినదేకాక 'రిమగరి' అను సంచారమే చూపినాఁడు! ఈరాగమున నిషాదము కాకలి యని చెప్పినందుకు రామామాత్యునిని వెంకటమఖి చెడఁదిట్టినాఁడు. నిజముచూడఁబోయినచో వెంకటమఖి అమాత్యునిని ఖండించుటకే గ్రంథము వ్రాసినాఁడనవలసియున్నది. అదిమొదలు నేఁటివఱకును కైశికినిషాదమే ఈరాగమునందు నెలకొన్నది. 'పనిపా' అను ప్రయోగమునందు నిన్నమొన్నటిదాఁక వినవచ్చుచుండిన ఆయింత కాకలికూడ వెంకటమఖిగారి మేళశాస్త్రశస్త్రమునకు వెఱచి అంతర్ధానమైపోయినది.

వస్తుస్థితిని విచారించితిమేని ఇందలి నిషాదము కైశికియుఁగాదు, కాకలియుఁగాదు. ఆస్వరము ఈరాగమున ఆరోహణములో వర్జ్యమై అవరోహణమందు కేవలము అనువాదిగామాత్రము మెఱుగుచూపుచున్నది. కనుక దానికి నిలుకడయైన స్వరూపము లేదు. 'ధనిదా' అన్నప్పుడు కైశికికి తక్కువగాను 'సనిపా' అన్నప్పుడు కాకలికి ఎక్కువగాను పలుకును 'సనీధా' అని యాడ్చిపట్టినప్పుడు కూడ నిషాదము ప్రాయికముగా సాఁఁనిధ అనియే స్ఫురించును. కనుకనే అవరోహక్రమములోను - సధాప - సధప అను ప్రయోగములు ఈరాగములో వచ్చును.

నిషాదమువలెనే దీనిమధ్యమముకూడ చాల శ్రద్ధతో గమనింపవలసినది. దానివలె ఇదికూడ ఆరోహణమున లేదన్నారు ప్రాచీనులు. నిషాదము షడ్జమునకో ధైవతమునకో అంటుకొనియే నడచినట్లు, మధ్యమము పంచమమునో గాంధారమునో ఆశ్రయించుకొనియే తోఁచును. గ మా అన్నప్పుడు కొంచెము తక్కువగాను, గ మా అన్నచోట 'గ గ పా ప మ' అన్నరీతిగా పంచమ నాదరేఖకు కడపటి చుక్కగాను మధ్యమము తోఁచవలసియుండును. కనుకనే - మ గ పా ధా - రి గ పా మ పా ధా - ఇట్లు మధ్యమమును లంఘించు ప్రయోగములు ఈరాగమునకు జీవములైనవి. షడ్జముతో శుద్ధసంవాదముగల మధ్యమమును ఎక్కువగా వాడుట ఈరాగమును చెఱుచును. ఋషభము కూడ దానివలె స్థిరస్వరూపములేని అనువాదిస్వరమే. కనుకనే రి గ పా, మ గ పా ఇత్యాది ప్రయోగాలు. సరి అను ప్రయోగము స పాఁ గ రి రి అనియే

స్ఫురించును. రి - మ - ని స్వరాలలో విన్యాసము చేయరాదు. ప - గ - ధలు జీవస్వరములు. కాంబోధి, కాంభోది, కాంబోది, కామోది, కామోదరి అనియు రూపములున్నవి

## ౪. కేదారగౌళ

ఈ రాగమంత ప్రాచీనము కాదు. మతంగుఁడు, పాల్కురికిసోముఁడు, రత్నాకరకర్త శార్ఙ్గదేవుఁడు, పార్శ్వనాథుఁడు మొదలగువారు దీనినెత్తలేరు. అన్నమాచార్యులకాలమునందే దీనికెక్కువ ప్రచారమున్నట్టు తోఁపదు. ఈరాగములో అతని కృతులు చాల మితములు. రామామాత్యుఁడు దీనిని లక్షించినాఁడు. రి - ధలు పంచశ్రుతులని, గ - ని స్వరాలు తీవ్రతరములని, స - మ - పలు శుద్ధములని చెప్పి అతఁడు కాంభోజిమేళమునకంటె భిన్నమైన స్వతంత్రమేళముగా దీనిని గ్రహించెను. గోవిందదీక్షితుఁడును కాంభోజి - కేదారగౌళలు రెంటికిని స్వరములొకతీరుగానే చెప్పినను రెంటిని భిన్నమేళములుగా గ్రహించినాఁడు! ఇద్దఱును ఇది సంపూర్ణమని మాత్రము చెప్పిరి కాని విశేషమేమియు తెల్పలేదు. వెంకటమఖి తండ్రిమతమునుదాహరించి, కేదారగౌళమునే మేళముగా గ్రహించి కాంభోజినందులో కలిపెను. కాని అతఁడును దీనిని వివరింపలేదు. అతని పేరిటి అనుబంధగ్రంథమువలన మాత్రము ఈరాగమునకు ఆరోహణమున గ - ధలు వర్జ్యములని చెప్పఁబడియె. అవరోహము సంపూర్ణము.

ఇప్పటికిదే స్థూలలక్షణము. కొంత సూక్ష్మముగా విచారించినచో ఈ విశేషములు తేలును —

ఋషభము స్వస్థానమున శుద్ధముగా నిలువక ఎప్పుడును మీఁది గాంధారస్థానము వరకును తూఁగుచుండును. దానితో సంవాదమునకై తరువాతి స్వరము మధ్యమము గూడ పంచమస్థానమువఱకును తిరుగాడుచుండునే కాని శుద్ధముగా నిలువదు. మ ప నీ
ప నీ పా అన్నప్పుడు నిషాదముగూడా షడ్జము నాశ్రయించుకొనియే ఊఁగును. అనఁగా అన్ని సంచారములందును ఋషభమునకు గాంధారము, మధ్యమమునకు పంచమము, నిషాదమునకు షడ్జము ఊతఁగా నుండునన్నమాట. ఇట్టే గాంధారముకూడ మధ్యమముతోడ్పాటుతోనే నడచును. ధైవతము పట్టి అనువాది స్వరము. ఆరోహములో అది లేదు. అవరోహములో దానిని వదలఁగూడదుగాని దానినీడ్చికాని నిలిపికాని పట్టరాదు. గాంధారము కూడ ధైవతమువలెనే దీని ఆరోహణమున లేకున్నను అవరోహమందు దానికంటె ప్రాధాన్యమెక్కువ సంపాదించుకొన్నది. ఋషభము తాను వక్రమునకు తోడై దానికి చోటుచేయును. మగస - రిగస లు ప్రయోగింపుట రక్తిప్రదము.

స - రి - మ - ని స్వరములలో దేనియందైనను విన్యాసము చేయవచ్చును. ఈవిషయములను గమనించిపాడినచో నారాయణగౌళ, మొదటి రాగముల ఛాయలను రానీయక ఈరాగమునకు స్వతంత్రస్వరూపము నీయవచ్చును.

## ౫. గౌళ

'సప్తగౌళల' మాట వెనుకనే చెప్పఁబడినది. వానిలో చేరనివి గౌళిపంతు గౌడసారంగ మొదలగునవి మఱికొన్ని రాగాలు గలవు. ఇవి కర్ణాటకపద్ధతిలో గౌడదేశమువారికిఁగల విశిష్టసంబంధమును సూచించును. అతిప్రాచీనకాలమునందె శుద్ధ, భిన్న, గౌడి, వేసర, సాధారణి - అను ఐదువిధములు పాటలో లక్షితములు. వానిలో 'గౌడి' గద్దమును ఎదకానించుకొని ఓ - హో యను నక్షరములమూలాన త్రిస్థానస్వరములను గంభీరముగా గాఢముగా గమకసహితముగా పాడునట్టిపద్ధతి యన్నారు లాక్షణికులు. కావ్యపద్ధతియందును వైదర్భి, గౌడి, పాంచాలి, అను మూఁడు రీతులు ప్రసిద్ధములే కదా! 'గౌళ' రాగముగూడ 'కర్ణాట' రాగమువలెనే ఎన్నో మార్పులు కాలక్రమమున చెందినది.

ఇప్పటి గౌళ మాళవగౌళమేళమందు జన్యము. ధైవతము వర్జ్యము. ఆరోహమున గాంధారము లేదు. అవరోహమందు వక్రముగా ఆదివచ్చును; 'మరిగమరిస' 'గామరిస' 'పమగమరిగమరి' ఇత్యాది. ఈరాగమందలి ఋషభమునకును మధ్యమమునకును గలసంవాదము షడ్జ - అంతరగాంధారముల సంవాదము వంటిది. కనుక రి - మ లను స్వస్థానమునందే శుద్ధముగా పట్టుట చాల రక్తిహేతువగును. ఆరోహమందు గాంధారము లేదు గనుక దానితో సంవాదియైన కాకలినిషాదము స్వస్థానమున నిలువక షడ్జము నాశ్రయించియే కదలుచుండును. స - మ -ప స్వరములు విన్యాసస్థానములు. రి - నిలు గూడ కావచ్చును. గాంధారము కారాదు.

ఘన, నయ, దేశ్యములని రాగలను మూఁడు తెగలుగా ప్రాచీనులు విభజించిరి. నాటి, గౌళ, ఆరభి, వరాళి, శ్రీ, బౌళి, మాళవశ్రీ, రీతిగౌళ, లను ఎనిమిదింటిని ఘనరాగములనుట వాడుక. కేదార, నాటకురంజి, సారంగ మొదలగు మఱికొన్నిటిని ఈగుంపులో చేర్చుట కలదు. పౌరుషభావప్రధానమై గాంభీర్యమును వెలువఱుచుట ఘనరాగపద్ధతి. నిజము చూడఁబోయినచో ఏరాగమునైనను ఘనముగా పాడవచ్చును. అట్లు చేయుటకు ముఖ్యమగుపద్ధతులు ప్రధానజీవస్వరములను పునరుక్తి - సస, రిరిరి, గగ మమమమ ఇత్యాది - చేయుట, ద్రుతవిలంబితములకంటె మధ్యలయము నెక్కువగా ఆశ్రయించుట, మంద్రమధ్యస్థానములలో నాభినుండి నాదమును ఓజస్విగా వెలువరించుట, ఇత్యాదులు.

## ౬. దేవగాంధారి (దేశీయ)

దేవగాంధారి అను పేర మూఁడు భిన్నరాగములున్నవి. ఒకటి ప్రాచీన గ్రంథములలో శ్రీరాగమేళమందు - ఇప్పటి ఖరహరప్రియయందు - జన్యమైనది. గోవిందదీక్షితుఁడు, వెంకటమఖి, రామామాత్యుఁడు దీనిని పేర్కొన్నారు గాని వివరించలేదు. పాల్కురికి సోముని పట్టీలో ఇది లేదు. సంగీతసారామృతమున తులజామహారాజు దీనిని ఆరోహమందు రిషభధైవతవర్జముగా అవరోహమందు సంపూర్ణముగా లక్షించినాఁడు. సుబ్బరామదీక్షితులు దానిని అనుసరించి కొన్ని లక్ష్యము లిచ్చినాఁడు. సోమనాథుఁడు మాళవగౌళమేళజన్యముగా ఈ పేరి రాగము పేర్కొని 'స రి మ ప ని స - స ని ధ ప మ గ రి స' అను క్రమముతో లక్ష్యవివరణము చేసినాఁడు.

ఇప్పటి వాడుకయందలి దేవగాంధారి శంకరాభరణమేళమున జనించినది. ఎక్కుటలో గ - ని స్వరములు లేవు. దిగుడు సంపూర్ణము. మేళమును మార్చుకొన్నచో సోమనాథుని దేవగాంధారి యిదే యగును. త్యాగయ్యగారి కాలము నుండియే దీనికి వ్యాప్తి యెక్కినది కాని ముందిది లేదనుటకు వీలులేదు. 'వేడుకతో వడచుకొన్న' అను క్షేత్రయ్య పదము ఈ రాగమందే పాడుదురు. ఈ సంపుటము మందలి తాళ్ళపాకవారి పదములు రెండును ఈ రాగమందే పొందిగింపఁబడినవి.

ఈ దేవగాంధారికిని ఆరభికిని ఎగుడు దిగుడు సంచారమొకటిగానే యున్నను విశేషము చాలఁగలదు. ఆరభిది మధ్యమకాలప్రధానమైన గతి. దీనిది విలంబప్రధానమైనది. దానిలో గాంధార నిషాదములు ఉన్నను లేనట్లు మ - స లను ఆశ్రయించుకొని నడుచును. దీనిలో నిషాదము షడ్జము నాశ్రయించి తీవ్రతరముగాను ధైవతము మాత్రము కోమలతరముగాను స్పష్టముగా - సా నిస నిసాస ధానిధని ధానిప అన్న రీతిని - గోచరించును. ధైవతము ఆరభియందువలె శుద్ధముగా నుండక, ఆరోహణమున పైషడ్జముదాఁక 'మ ప స ధా దా' ఇట్లు వాలి పోఁగును, దిగునప్పుడు కోమలనిషాదమును కూడ కలుపుకొని పోలును. గాంధారము స్వస్థానమున నిలువక మధ్యమమును కోమలముగా వెంటఁదీసికొనుచునే ఋషభమునకు దిగును. 'మ గా రి' అన్న నడక 'మ గమ గమ గ మ రీ' అనియే చెల్లును. మధ్యమముగూడ పంచమముతోనో గాంధారముతోనో చేరియే వ్యాపించును. రిషభము శుద్ధముగానుండక

కంపితముతోనే రాణించును. ఇందు శుద్ధముగా దీర్ఘముగా కైశిక నిషాదమును పట్టి చూపుట చౌకరకపు రచన. శుద్ధకాకలియు నట్టిదే. స - రి - ప - ధ స్వరములు రాగవిన్యాసస్థానములు.

ప మ ధా ని స రీ  స ని స ధా - ఇత్యాది ప్రయోగములు గలవు. స్వరాక్షరముల దృష్టినిదాటి వాదభావములనెఱిఁగి పాడవలసినరాగము.

## ౭. దేశాక్షి

గ్రామ జాతిరాగములు అంతరించిన తరువాత వచ్చిన 'రాగాంగ' రాగములలో 'దేశాఖ్య' ఒకటిగా శార్ఙ్గదేవుఁడును పార్శ్వనాథుఁడును పేర్కొన్నారు. అదే తరువాత భాషాపరిణామమునుబొంది 'దేశాక్షి' గా మాఱినదని యూహింపవచ్చును; 'కామాఖ్య' అను శబ్దమే 'కామాక్షి' గా పరిణమించినట్లు. 'దేసాక్షి' అనియూ రేకులందలి రూపము.

పాల్కురికి సోముఁడు దీనినెత్తలేదు. మతంగుఁడును నట్లే. రామామాత్య గోవిందదీక్షిత వెంకటమఖి సోమనాథులు దీనిని ఒకటేవిధముగా లక్షించినారు. అందఱును దీనిని ప్రత్యేక మేళముగా గ్రహించిరి. స, షట్ - రి, అం - గా, శు - మ, ప, చ - ధ, కా - ని, స్వరములుగలది. రామామాత్య సోమనాథులు దీని గాంధారమును నిషాదమును తీవ్రతమముగా - అనఁగా మృదుమధ్యమముగా - లక్షించిరి. కాని వీరెవరును దీని ఇతరస్వరూపములను వివరించలేదు. వెంకటమఖి రచించినదని చెప్పఁబడు రాగలక్షణానుబంధములో దీనికి ఆరోహమున రి - ని స్వరములును అవరోహమందు గాంధారమును లేవని చెప్పఁబడినది. దానినే మఱికొంత సవరించుచు సుబ్బరామదీక్షితులు 'స మ గ ప ధ స - స ని ధ స ని ప మ రి స' అను సంచారము తెల్పెను. వెంకటమఖి రచించినదని ఆయన చూపిన తానమున, మ మ ప ప, ప మ గ మ మ ప, రి స ని స్స స - ఇట్టి విశేషప్రయోగములు గలవు. ముత్తుస్వామిదీక్షితులు ఈరాగములో రచించినకీర్తనలో 'శూలిని' అని రాగనామము ముద్రించెను. 'కనకాంగి' మొదలగు ౭౨ మేళములలో ఈ 'శూలిని' ౩౫-వ మేళసంఖ్యను సూచించునామమై నిలిచినది. అందు త్యాగయ్యగారు రచించిన 'ప్రాణనాథ' అనుకృతిని నేనెఱిఁగిన ప్రాచీనులందఱు శంకరాభరణమందే పాడుచుండిరి. ఈరాగమును నిర్వహించుట యందలి కష్టమును ఆ విషయము సూచించును. కాలక్రమమున 'బిలహరి' రాగము నెలకొని, ఇందలి ఋషభముతీవ్రతను తగ్గించి ఉపయోగించుచు ఈరాగమును ప్రయోగించి[illegible]

౧౭. ఇప్పటి 'ఓలహరి' లో ఇంకను అప్రచ్యుతఋషభచ్ఛాయ ఉండుటయున్న దనుట నూతక్రమముగా గమనింపవచ్చును.

కాని ఈరాగమునకే ప్రత్యేకస్వరూపమున్నది. ప మ రీ, మ మ ప ప మ రీ, స ని ని స ని ప ప మ ధ ప ప మ రీ, మ గ మ ధ స ని పా — ఇత్యాదిప్రయోగములతో దీనిస్వరూపమును తెలుపవచ్చును. ప్రాతఃకాలపురాగముగా దీనిని ప్రాచీనులు గ్రహించియుండిరి. దీనిని కాదేసిన 'ఓలహరి' కి ఇప్పుడాస్థానము లభించినది.

## ౮. ధన్యాసి

ధనశ్రీ, ధన్యాశి, ధన్యాశికా, ధనాశికా, ధన్నాసి, ధనాసరి, దనాసరి – అని కూడ దీనిని పేర్కొన్నారు. ప్రాచీన రాగాంగరాగములలో నొక్కటిగా దీనిని శార్ఙ్గదేవుడు గ్రహించినాడు. లక్షణము స్పష్టముగా లేదు. గాంధారపంచమము లల్పములన్నాడు. అది యిప్పటి లక్ష్యములకెల్ల విరుద్ధము. రామామాత్యుడు 'బహుళో రిధవర్జితః' అని లక్షించుట ఇప్పటికి కొంతయనుకూలించునుగాని, అతడు దీనిని శ్రీరాగమేళమునందు చేర్చుటచేత రి – ధ లు, వచ్చినప్పుడు, తీవ్రములై ఇప్పటి ధన్యాసి కాకపోవును. గోవిందదీక్షితుడు దీనిని శ్రీరాగమేళమందే చేసి రి – ధ లను పూర్తిగా వర్జించి ఔడవరాగముగా లక్షించి 'ఇదివైణిక సంప్రదాయము' అన్నాడు. కుమారుడు తండ్రినను సరించినాడు. కాని అతని పేరిటి రాగలక్షణానుబంధమున శ్రీరాగజన్యమై రి – ధ త్యక్తమైన ఔడువరాగము 'శుద్ధ ధన్యాసి' యనియు, రీతిగౌళ (నఠభైరవి) మేళజన్యమై ఆరోహణమందుమాత్రము రి – ధ లను విడిచినది 'ధన్యాసి' అనియు కొంతసవరణ వచ్చినది. దీనిచేత అవరోహణమందు అప్పుడున్న శుద్ధధైవతము బ్రతికినది గాని, చతుశ్శ్రుతి ఋషభము గొంతుపట్టుకొనుచున్నది. సోమనాథుని మతమందు రామామాత్యుని ధన్యాసియే కానవచ్చుచున్నది. అతడిచ్చినలక్ష్యములో రి – ధలు క్వాచిత్కముగానే ఉన్నవి. తులజామహారాజు మతమునను ఇది ఔడువరాగమే.

ఇప్పటి వ్యవహారమున ఇది ఉత్తరాంగమందలి కోమలధైవతమునకు సంవాదిగా పూర్వాంగమందలి ఋషభమును కూడ కోమలపఱచికొని రక్తిని పెంచుకొన్నది. కనుక తోడి మేళమున ఇటీవలివారు దీనిని చేర్చినారు. ఇట్లిది ఔడవ – సంపూర్ణ రాగము.

రి – ధ లు రెండును విలుకడలేని అనువాదిస్వరాలు మాత్రమే. గాంధారము ఋషభమునకు దిగినవెంటనే షడ్జమునకును, నిషాదమునకు ధైవతమును తాకినవెంటనే

పంచమమునకును, వచ్చినప్పుడే విశ్రాంతి. గాంధారనిషాదములు తమస్థానమున శుద్ధముగా నిలువవచ్చునుగాని కంపితగమకములతో ఆరోహణమందును, దిగజారుటతో అవరోహణమందును సంచరించుట ఈరాగమును చక్కగా తెలుపును. ఆరెంటుస్వరములును సంవాదులు కనుక ఇందు జీవస్వరములు. మధ్యమము స్వస్థానమున శుద్ధముగా నిలిచి రక్తినిచ్చును.

సగామ, మగా, పనిధాప, మపనీస, ఇట్టిప్రయోగములు ముఖ్యములు. సనిపమపగా, గమగసనిసధాప - ఇట్లును ప్రయోగింపవచ్చును.

## ౯. నాట

చాల ప్రాచీనమైనరాగము. ప్రాచీనములైన యేడుశుద్ధస్వరజాతులలో ధైవతి, ఆర్షభి తప్ప తక్కినయైదుజాతులును 'హిందోళము' నకు ప్రకృతులని, దాని నుండిపుట్టిన 'భాషారాగము' 'పింజరి' యని, దానినుండిపుట్టిన 'భాషాంగ' రాగము 'నట్ట' అని - గోవిందదీక్షితుఁడు వ్రాసెను. నాట, నాటి అనియు దీనికే పేరు. దీనిలక్షణనిర్వచనములో పూర్వికులు ఆధునికులును ఏకకంఠముగానుండుట విశేషము. విద్యారణ్యులమతమున ఇది మొదటిమేళమట. పాటలు, పురాణములు, భజనలు, నాటకములు - వీనిలోనెల్ల దీనినే మొదలు పాడుట మనసంప్రదాయముగా నుండెడిది.

మేళక్రమమున ఇది ౩౬వ మేళము. చలనాట యనుపేరు ఆసంఖ్యను సూచించుటకై యేర్పడినది. అంతేకాని చలనాట వేఱు నాట వేఱు అనుకొనుట అవిచారిత రమణీయము. ష - రి, అం - గ, శు - మ, ష - ధ, కా - ని, స్వరములు గలది. రిషభము నొక్క గాంధారమునకును, ధైవతము నొక్క నిషాదమునకును ప్రాఁకవలయును. ఇందలి గాంధారము అంతరమునకన్న, నిషాదము కాకలికన్న ఎక్కువగా పలుకునని, వానిని మృదుమధ్యమ మృదుషడ్జములని వ్యవహరించిరారు రామామాత్య సోమనాథులు. అదిగమనింపఁదగినది. గాంధారమునకు మధ్యమమునుండియు నిషాదమునకు షడ్జమునుండియు జారతనిచ్చి కంపితగమకములతో పట్టవలయును. కనుకనే ఈరాగమందు సమ - పస అను దాట్లు లక్ష్యములలో ఎక్కువగానవచ్చును. ఆరోహము సంపూర్ణముగాను, రి - ధ లను వదలి ఔడవముగాను, నిషాదమునుగూడ వదలి చతుస్స్వరముగాను సంచరించవచ్చును. అవరోహమున గ - గ లు వర్జ్యములు.

స - ప లు ముఖ్య విన్యాసస్థానములు. రి - మ లలోను విన్యసించవచ్చును. ధైవతము అనువాదిస్వరముమాత్రమే. ఆరోహమున గాంధారము పాడిగించవచ్చును.

ఘనరాగముగనుక సంయుక్తస్వరరచన దీనికి జీవమునిచ్చును.

## ౧౦. పాడి

పవాడి, పహాడి అనియును రూపములు గలవు. మాళవగౌళజన్యము. గాంధారవర్జితమై ధైవతము వక్రముగా సంచరించు షాడవరాగము. సరిమ పధ పనిస - సనిపధ పమరిస అను సంచారముగలది.

రత్నాకరకర్త దీనిని గ్రహింపలేదు. రామామాత్యుఁడు 'గహీనషాడవరాగము'గానే దీనిని లక్షించినాఁడు కాని 'శుద్ధరామక్రియ' మేళమున చేర్చినాఁడు. అనఁగా మధ్యమము మాత్రము తీవ్రము. తక్కిన స్వరాలన్నియు సమానమే. ఇందు కొంత న్యాయమున్నది. గాంధారము శుద్ధముగా వర్జించినప్పుడు కాకలినిషాదము ప్రతిమధ్యమముతోడి సంవాదము చేత రాణించును. మధ్యమము శుద్ధమైనప్పుడు ఆనిషాదము చాలా దుర్బలస్వరమగును. రామామాత్యుని సిద్ధాంతమును ఖండించుచు గోవిందదీక్షితుఁడు, ఈరాగమున తీవ్రమధ్యమము వ్యవహారమున లేదుగనుక గుర్జరి (మాళవగౌళ) మేళమందే ఇది జన్యము కావలెనన్నాఁడు. ఈమతమే అహోబలపండితుఁడును సోమనాథుఁడును అవలంబించిరి. పుండరీకవిఠలుఁడు 'సద్రాగచంద్రోదయము'న ఈ రాగమున గాంధారమే వర్జ్యమని చెప్పినను, 'రాగమంజరి'లో ధ - గలు రెండును వదలవలెనన్నాఁడు. వెంకటముఖి 'చతుర్దండిప్రకాశిక'లో 'గలోపః షాడవః' అనియే కలదు. కాని 'అనుబంధము'లో ధైవతము వక్రముగాఁగలదను సవరణ యున్నది. అనఁగా 'పధనిసా - సనిధపా' అనుసంచారము లేదని, 'పధపనిసా - సనిపధపా' అని సంచరించవలెనని, అతని మతము. కాని అతఁడు రచించినదని సుబ్బరామదీక్షితులు ప్రచురించిన గీతమందు 'పసనిస' అను నిషాదలంఘనమే యెక్కువగాఁగలదు. 'పనిసా' అని ఒకతూరిమాత్రమే కానవచ్చుచున్నది. అర్థమేమనఁగా, ప్రధానసంవాదిస్వరమైన గాంధారము లేదుగనుక నిషాదము ఉండినను చాలా దుర్బలముగానే ఉండకతీరదన్న సత్యమును ఆయన లక్ష్యమున సూచించినాఁడన్నమాట. తులజామహారాజు దీనినే అనువదించినాఁడు. గాంధారము లేక పోయినను పంచమమున్నది గనుక, షడ్జముతో అంతరగాంధారమువలె, దానితో కాకలీనిషాదమునకు సహజసంవాదము కలదని గమనించి కాఁబోలు, ముత్తుస్వామిదీక్షితులు 'శ్రీగురుణా' అన్నకీర్తనలో నిషాదమునకు కొంచె మెక్కువగా చోటు చేసి రచించినాఁడు.

ఈ రాగములో ప్రబలమైన విన్యాసస్వరము ఋషభమే. దానితో పూర్ణసంవాదముగలిగి ధైవతమును ప్రబలముగానే స్ఫురించును. మధ్యమము స్వస్థానసుందరము. స - ప, రి - ధ లవలె మ - సలు సంవాదరమణీయములు. కనుక నిషాదము అనువాది మాత్రమే.

## ౧౧. బౌళి

మాళవగౌళ జన్యము. బహులి, భవులి, అనికూడ ఈపదమునుచ్చరించినారు. 'స రి గ ప ధ స - స ని ధ ప గ రి స' అని యిప్పటి దీని సంచారము. స ని స ధ ప, ప ధ ని ధ ప - అనికూడ సంచారము చేయవచ్చును.

దీనికి గ్రహస్వరము మధ్యమమఁట! వేలువేలు రాగాలకు భిన్నస్వరాలను గ్రహముగా స్వీకరించి పాడుపద్ధతి పూర్వకాలమున నుండినది. కాని స్థిరస్వరముగా షడ్జము నెలకొన్న తరువాత అది అంతరించినది. కాని కొన్నివందల యేండ్లుగా ఈరాగమునకీస్వరము గ్రహమని చెప్పుశాస్త్రము మాత్రము ప్రచారముననుండినది. కొందఱు గాయకులలో అసంప్రదాయము కేవలము శ్రుతిభేదముతో స్వరరచన చేయు వింతవ్యాయామముగా ఉండెను. ఇప్పుడదియు కానరాదు. అదృష్టమే!

గోవిందదీక్షితుని కాలమునకే ఇంత మధ్యమస్వరమును వర్జించవలెనని 'నవనైణికులు' అనుమంచిరఁట. కాని మధ్యమము గ్రహస్వరముగా శాస్త్రనిదేశమున్నప్పుడు దానిని వర్జించుట న్యాయము కాదన్నాఁడాయన. కాని ఆలాపరాగాదులలో షడ్జమే గ్రహముగా అప్పటికే 'సర్వజనప్రసిద్ధము' గానుండినదఁట. కాఁబట్టి ఆపండితుఁడు ఈ శాస్త్రవ్యవహారముల విరోధమునకు ఏదో చమత్కారమైన సమాధానమిచ్చినాఁడు. కాని దాని తాత్పర్యము నాకు నుగ్రహము కాలేదు. రామామాత్యుఁడు 'మధ్యమాంశగ్రహన్యాసా బౌలీ పంచమవర్జితా' అని లక్షించినాఁడు. అప్పటిదది యిప్పటి 'లలిత' రాగమగును. సోమనాథుఁడేమో షడ్జమే దీనికి గ్రహాంశన్యాసస్వరముగా గ్రహించి మ - ని వర్జితముగా లక్షించినాఁడు. కాని లక్ష్యప్రదర్శనమునందు 'రినిసధ' అని అల్పనిషాదప్రయోగము నంగీకరించినాఁడు. వేంకటమఖి మధ్యమమే గ్రహస్వరమని శాస్త్రమునను వాదము చేసినను, తత్కాలవ్యవహారమును మన్నించి, మధ్యమము వదలిన షాడవరాగమనియే నిర్వచించినాఁడు. ఒక గీతమును ప్రబంధమును రచించి అందు 'నిసధ' అను ప్రయోగము చూపినాఁడు.

ఇదియు ఘనరాగమే. ప - పలు, గ - గలు సంవాదులు. నిషాదము దుర్బలమైన అనువాది. ఋషభము హానికన్న మేలు. కాని అదికూడ విన్యాసస్వరము కాదు.

## ౧౨. భైరవి

సుప్రసిద్ధమైన రక్తిరాగము. వేంకటమఖి పద్ధతిప్రకారము ౨౦ వ మేళమున జన్యము. ఈ మేళమును రీతిగౌళ మేళమన్నాడతడు. కాని అతనితండ్రి గోవింద దీక్షితుడు భైరవినే మేళముగా గ్రహించెను. చ-రి, సా-గ, శు-మ, శు-ధ, కై-ని స్వరములు గలది. లక్ష్యములో ఎక్కడనైనను ఒకచోట పంచశ్రుతి ధైవతము కూడ వినవచ్చునన్నాడు గోవిందదీక్షితుడు. ఆమాట కుమారుడును అనువదించినాడు. ఈ తీవ్రధైవతమునే ప్రధానముగా గమనించి సోమనాథుడు దీనిని శ్రీరాగమేళమున చేర్చినాడు. అతని ౨౩ మేళాలలో ఈశుద్ధధైవతముగల మేళమే లేదు! అతనికంటె మొదలు రామామాత్యుడును ఇట్లే నిర్ణయించెను. కాని గోవిందదీక్షితుల కాలమునకే దీనిలో శుద్ధధైవతము కాలూది నిలిచినది. ఆకస్మికముగా అందందు తీవ్రధైవతము తోచినమాత్రాన ఇంకొక మేళమున దీనిని చేర్పరాదని అతడు నిర్ణయించెను. ఆనాడు మొదలు నేటిదాక శుద్ధధైవతమే ఈ రాగమునకు స్వరూపదానము చేసినది.

దీనిలో చతుశ్శ్రుతిధైవతమున్నదా లేదా అనువిషయమున కొన్నియేండ్లుగా పెద్దపెద్దవిద్వాంసులు హోరాహోరిగా వాదము సాగించిరి. త్యాగయ్యగారి పుణ్యాన క్రొత్తగా ప్రచారమునకు వచ్చిన ఖరహరప్రియను పాడమరిగిన అనేకులు ఆధునిక విద్వాంసులు చతుశ్శ్రుతిధైవతమును మితిమీతి యీ రాగమందు కలుపుచున్నారు. ఇందుమూలమున ఇప్పుడు ఈ రెండు రాగాలకును గలభేదము అంతరించుసూచనలు ప్రబలమగుచున్నవి. ఆరోహావరోహముల అంతస్తును దాటి ఇతరస్వర రాగధర్మములను ముఖ్యముగా గమనింపక పోవుటమూలమున వచ్చిన దోషమిది.

చ - ధైవతమిందున్నది. కాని దాని మితి గతి యెట్టిది? శుద్ధమైనను చతుశ్శ్రుతియైనను ధైవతము ఈరాగమున విన్యాసస్వరము కాదు. ధా, ని ధా, ప ధ ని స ని ధా, మ ధా, గ మ ప ధా - ఇట్లు విన్యసింపరాదు. ధైవతమును తాకినవెంటనే పంచమనిషాదములలో దేనికో యొకదానికి మారవలసినదే. ఆరోహణమున చతుశ్శ్రుతి ధనియు, అవరోహణమున శుద్ధధనియు వానిని నిర్ణయించుటకూడ స్థూలమైన లక్షణమే. చతుశ్శ్రుతిధైవతస్థానము మొదలు షడ్జముదాక 'వలి' గమకముతో నిషాదము సంచరించుట ఈ రాగప్రముఖ్యలక్షణములలో నొకటి. కనుక పధనిస, సనిధనిస ఇత్యాది ప్రయోగాలలో పా పధ ధ సా ని ని స ని, స ని ని ధ ప సా ని స ని ఇట్లు ధైవతమును పంచమమునతో నిషాదమునతో అంటించి పలికించుట సంప్రదాయము. నిజము

చూడఁబోయినచో ని-ప స్వరాలనడుమ చిక్కి ధైవతము ఈరాగమున నలుగుచున్నది. శుద్ధధైవతమును ఇట్టే ని ధా ప అన్నప్పుడు జాతిదిగును. ప ధ ప అన్నప్పుడు అతి కోమలమై పంచమవికారమేయైయుండును. ఎంతముఖ్యమైనను కేవలము పరతంత్రమైన స్వరమిది.

దీని వంటిదే ఇందలి గాంధారముగూడ. అదిగూడ విన్యాసస్వరము కాదు. రి - మ లలో ఏదోయొక దానితో గాంధారగతికి ముక్తాయింపు కావలెను. 'గారి' అను ప్రయోగము రి గ రి మ గ రి అని కాని మా ( గ రి అని కాని, తోఁపవలెను. ఇంకను రెండవప్రయోగము మ రి రి రి గ రి అని స్ఫురింపఁజేసినచో ఈరాగము స్పష్టపడును. రి గ రీ, రి గా రి, ని గ రి ఇత్యాదిస్థలములలో గాంధారము సాధారణస్థానముకంటె ఒకరేఖ తక్కువగానే పలుకును. మధ్యమము విన్యాసార్హమైన స్వరమైనను గాంధారస్థానము మొదలు పంచమస్థానమువఱకును ఎక్కిదిగుచుండును. శుద్ధముగా నిలుచుటయు కలదు. పూర్తిగా స్వస్థానములో నిలుచునవి ఈరాగములో స - రి - పలు మాత్రమే.

## ౧౬. మాళవి

మాళవశ్రీకి, మాలవపంచమము మొదలగు అనేక ప్రాచీనరాగములు కర్ణాటగౌడాదులవలె మనగానపద్ధతియందు మాళవదేశమువారి ప్రభావమును తెలుపుచున్నవి. మాళవగౌళ మనకుగ్గుపాలవంటిది. మాలవశ్రీ ఘనరాగముగా ఇంకను జీవించియున్నది. 'మాలవా' అను రాగమొకటి రత్నాకరమునయున్నది. పాల్కురికి సోమునిపట్టీలలో 'మాలవి' కలదు. తరువాతి రామామాత్యాదులెవరును దీనిని గ్రహింపలేదు. తులజామహారాజు గ్రహించినాఁడు గాని దానినతఁడు మాలవగౌళమేళమున గ - ధ వర్జమైన ఔడువరాగముగా లక్షించినాఁడు. అది వేఱురాగమనుట స్పష్టము.

త్యాగయ్యగారి 'నెనరుంచినాను' ప్రకృత మీ రాగమునకు ముఖ్యలక్ష్యముగానున్నది. అది హరికాంభోజిమేళమున 'స రి గ మ ప మ ధ ని స - స ని ధ ని ప మ గ మ రి స' అను వక్రసంపూర్ణసంచారముగలదిగా నమర్పఁబడియున్నది. పట్ణం సుబ్రహ్మణ్యయ్యగారి 'ఇదెన్యాయమా' అను చిన్నకృతి తప్ప ప్రామాణికమైన ప్రాచీన లక్ష్యము నాకు లభింపలేదు. కేవలము ఆధునికమనఁదగు 'సంగీతసారసంగ్రహము' నందు 'స రి గ మ ప ని మ ధ ని సా' - అను ఆరోహిసంచారవిశేషముతో

ఈ రాగమిట్లే లక్షింపఁబడినది. 'ప ని మ' అను సంచారము ప్రత్యేకముగా చూపనక్కఱలేదు. ని - మలు సంవాదిస్వరములు గనుక ఎట్లును అవి చేరకయుండలేవు.

ఈ లక్షణమననుసరించియే ఇందలికృతులు అమర్పఁబడినవి. నిషాదగాంధార స్వరములు అనువాదులు. రి - మ - ధలు విన్యాసస్వరములై స్వస్థానములలో ప్రకాశించును. పంచమము ఆరోహికన్న అవరోహిసంచారములో ప్రబలముగా రాణించును.

## ౧౪. ముఖారి

మతంగుని గ్రంథమున 'ముఖారీ' అను రాగమొకటి యుద్ధృతమైనది. శార్ఙ్గదేవుఁడు దీనిని స్మరింపలేదు. ఇది అతిప్రాచీనరాగముగాఁ గానవచ్చుచున్నది. సామవేదమునుండి సంగీతకళ వేఱుపడినకాలములో ఏర్పడిన జాతిరాగాలలో ఇది మొదటిదేమో అనుకోవలసియున్నది. సామగానములో ఇప్పటికిని ముఖారి పలుకుబడులే ఎక్కువగా వినవచ్చుచున్నవి. రీ గా రీ సా, రి స నీ ధా, ధ ప ధ పా, ని ధ పా, స రి గా రీ - ఇత్యాదులు గమనింపవచ్చును. రామామాత్యుఁడు 'సర్వేషు రాగమేలేషు ముఖారీమేళ ఆదిమః' అన్నాఁడు. సోమనాథుఁడు మొదలగు ఎందఱో లాక్షణికులీమాటనే అనువదించినారు. తులజామహారాజు ప్రాచీనశుద్ధగ్రామరాగములు ఏడింటిలోని 'శుద్ధసాధారితము' గా దీనిని పేర్కొన్నాఁడు. ఇందులో వచ్చు సప్తస్వరములును 'శుద్ధ' మైనవని ప్రాచీనలాక్షణికులందఱును అన్నారు: అనఁగా సామవేదపు స్వరములన్నమాట. కోమలఋషభమునకును కోమలధైవతమునకును శుద్ధశబ్దము ప్రయోగించు వాడుకవచ్చిన తరువాతికాలములో 'కనకాంగి' 'కనకాంబరి' అని 'శుద్ధ' స్వరమేళమొకటి గణితప్రకారముగా సృష్టించి, దానిలో ఒక 'శుద్ధముఖారి'ని గల్పించి, ఇప్పటి ప్రాచీనముఖారిని దేశ్యరాగముగానంగీకరించి, శాస్త్రగౌరవమును తమరుచిని నిలుపుకొన్నారు కొందఱు బుద్ధిమంతులు!

ఇప్పటి దీని సంచారము స రి మ ప ధ సా - స ని ధ ప మ గ రి స అని. ౨౦ వ మేళమున చేరినది. ఇది సామాన్యలక్షణము. నిషాదగాంధారాలు రెండును ఎంతముఖ్యములైనను స్వస్థానములో నిలువవు. గాంధారము ఋషభమునంటుకొని చాలా మృదువుగాఁ గాని, మధ్యమమునుండి రిషభమువఱకు దిగజాఱుటఁగాని సంచరించును. నిషాదమును ఇట్లే ధైవతషడ్జములతో కలిసియుండును. మధ్యమము పంచమమువఱకు ఎక్కుడిగు జాఱులతోఁగాని కంపితముతోఁగాని సంచరించును. శుద్ధముగా స్వస్థానమందు నిలిచియు రాణించును. 'స రి మా' అను ప్రయోగముతో సంవాదముగల 'ప ధ సా' అనుచోటను, ని ధ మా, ని ధ ప ధ సా, స ని ధా, అనుచోటులందును ధైవతము

చతుశ్శ్రుతిగా స్ఫురించును. 'ధ మా' అను నడకలో కోమలతీవ్రములు రెండును గలవు. కోమలధైవతము విన్యాసస్వరము కాదు. చ - ధైవతము భైరవికంటె ఇందెక్కువ ప్రభావముగలిగి కొంతవఱకు విన్యాసస్థానముగూడ నగును. ప ని ధ సా, ప గా రి స, రి గ పా, స రి నీ ధ మా, స రి గా రీ, స రి మ గా ( రి - ఇత్యాది ప్రయోగములు రాగస్ఫోరకములు.

తాళ్ళపాకవారెక్కువగా వాడినరాగాలలో నిదొకటి.

## ౧౫. రామక్రియ

పాల్కురికి సోముఁడు దీనిని పేర్కొన్నాఁడు. ప్రాచీన 'క్రియాంగ' రాగములు ౧౫-టిలో దీనిని ౧౩-వదిగా గోవిందదీక్షితుఁడు పేర్కొనెను. తరువాత విద్యారణ్య మతానుసారముగా తానుల్లేఖించిన ౧౫ మేళములలో దీనిని ౧౨-వదిగా గ్రహించెను. దానికి శుద్ధరామక్రియ యని పేరిచ్చినాఁడు. రామామాత్యుఁడు సోమనాథుఁడును దీనిని గ్రహించినారు. వెంకటమఖి మేళపట్టికలో ఇది ౫౧-వది. ఆసంఖ్యను సూచించుటకే 'కాశి రామక్రియ' అను పేరు దానికీయఁబడినది. ఈ మేళమునకే 'కామవర్ధని' అను నామాంతరము 'కనకాంగి' సంప్రదాయమున వచ్చి వాడుకలో ఇప్పుడునిలిచినది. 'సింధురామక్రియ' 'నాదరామక్రియ' ఉన్నవి గనుక దీనిని 'శుద్ధరామక్రియ' అనవలసి వచ్చినదని ఊహింపవచ్చును.

శు - రి, అం - గా, ప్ర - మ, శు - ధ, కా - ని స్వరములు గలది. సంపూర్ణము. షడ్జగాంధార పంచమాలు జీవస్వరాలు. స - ప, రి - ధ, గ - ని స్వరములు, రి - మ, గ - ధ, మ - ని, స్వరములు, స - గ, గ - ప, ప - ని, ధ - స స్వరములును పరస్పరముగా వేఱువేఱువిధముల సంవాదముచేత ప్రకాశించును. ఈ మూఁడుస్వరగతియందలి సంవాదమే ఈరాగస్ఫూర్తి కెక్కువపనికివచ్చును. 'సగరిగపామపధనీధసా - సనిధపమగరిస,' అని సామాన్య సంచారము. రి - మ - ని స్వరాలు అనువాదులు. ధైవతముగూడ దుర్బలమే. విన్యాసమునకర్హముగాదు. కనుక ని - రి లు షడ్జమును, మ - ధలు పంచమమును ఆశ్రయించుకొనియే ఇందు సంచరింపును. స గ రి మ గ ధ మ ని ధ స, స ధ నిధ మప ధగా, ప గ మ రి గా - ఇట్లు దాట్లతో సంచరించవచ్చును. ఎన్నిచుట్లు తిరిగినను స - గ - ప లలో ఏదోయొకదానియందు విశ్రమించుకొనక తీఱదు. పార్శ్వనాథుఁడిందు ఋషభమే లేదనెను.

C

సోమనాథ రామామాత్యులు ఇందలి గ - ని స్వరములకు మృదుమధ్యమ మృదుషడ్జములని పేరిడినారు. కాని ఆధారషడ్జశ్రుతితో పూర్ణసంవాదముగల గాంధారము విన్యాసస్వరమైనప్పుడు స్వస్థానమును వదలి కదలఁజాలదు. అనువాదిగా నుండుటచే నిషాదమేమో యిప్పటికిని మృదుషడ్జమనఁ దగినదిగానే యున్నది.

మాళవగౌళజన్యముగా మఱియొక రామక్రియను సోమనాథుడు ఇదే స్వరగతితో లక్షించినాఁడు. ఇందలి రామక్రియ తీవ్రమధ్యమరాగముగానే అమర్పఁబడినది.

## ౧౯. రీతిగౌళ

రీతిగౌడ, రీతిగౌర అనియు రూపాంతరములు. రామామాత్యునికి పూర్వము ఈ రాగము అల్పప్రచారమని తోఁచుచున్నది. తాళ్ళపాకవారి రచనలలోను ఇది చాల అపురూపముగా నుపయుక్తము. సోమనాథుఁడు దీనిని తలపెట్టలేదు. రామామాత్యుఁడు దీనినే మేళముగా గ్రహించి స రి గ మ లు శుద్ధములనియు పంచశ్రుతి ధైవతమనియు నిషాదము కైశికియనియుఁ జెప్పెను. అప్పటికిది ఇప్పటి ౧౦-వ మేళమగు 'నాటకప్రియ' యగును. ఈ మతమును తీవ్రముగా ఖండించి వెంకటమఖి ఈ రాగమును భైరవిమేళజన్యముగా నిర్వచించెను. అనఁగా ధైవతము శుద్ధమన్నమాట. కాని యిది ఆతనితండ్రి గోవిందదీక్షితుని మతమునకే విరుద్ధము. అతఁడును రామామాత్యుని మతమును ఖండించి దీనిని శ్రీరాగమేళములో చేర్చెను. అనఁగా చతుశ్శ్రుతి ధైవతముగలదనుట. దీని నెఱిఁగియున్నను సుబ్బరామదీక్షితులు వెంకటమఖి మతమునే ఆశ్రయించెను. అందును వెంకటమఖిమూలగ్రంథమందు భైరవియే మేళముగా గ్రహింపఁబడి రీతిగౌళ తజ్జన్యముగానుండఁగా, అతని పేరిటి రాగానుబంధమందు అది తలక్రిందైనది! రీతిగౌళ - నారీరీతిగౌళ - మేళము, భైరవి అందుజన్యము.

ఇప్పటిలక్ష్యముల నాలోచింపఁగా రామామాత్యుని శుద్ధఋషభము కానరాదు గాని దీక్షిత - మఖుల ధైవతములు రెండును ఇందుఁగలవు. సామాన్యసంచారము 'స గ రి గ మ ని ని సా - స ని ధ మ గ రి స' అనవచ్చును. చ - రి, సా - గ, శు - మ, చ - ధ - కై - ని స్వరములు. పూర్వోత్తరస్థాయిభాగములలో గ మా - ని సా అను పరస్పర సంవాదముగల నుడికారములు ఈ రాగమునకు జీవనములు. ఈ నడుమ మ - ని స్వరముల సంవాదమునకు ప్రాముఖ్యమేర్పడును. ఉత్తరభాగములో నిషాదము ప్రబలమై ధైవతమును, పూర్వాంగమున దానికితోడు గాంధారము ప్రబలమై ఋషభమును, మ్రింగివేయును. రి గ స, మ గ స, స గ మా, ని ని ప, ని ని సా రి - ధ లను లంఘించి ప్రయోగింపవలయును. ని ధ మా అన్నప్పుడు ధైవ

స్పష్టముగా సాధారణగాంధారప్రయోగమే చేసి పాడ సాహసించుచున్నారు! అది యట్లుండనిండు.

వరాళియందలి శుద్ధగాంధారము చతుశ్శ్రుతిఋషభస్థానమున పుట్టి కంపితగమకములతో సాధారణగాంధారముదాఁక ఊగుచుండును. కాని చతుశ్శ్రుతి ఋషభమునకే ఇది మాఱుపేరని కొందఱు చేయు ప్రయోగములు రాగస్వరూపమునకే హానికరములు. రి గ మ ధ ని స్వరాలైదును స్వస్థానములో ఎప్పటికిని నిలువక ఆడుచునే యుండును. ఋషభము షడ్జముతోను ధైవతము పంచమముతోను కలసినట్లుండి అతికోమలముగా వర్తించును. మధ్యమము పంచమమునందును నిషాదము షడ్జమునందును ఏకీభవించినట్లు తీవ్రతమముగా ప్రసరించును. దీని నిషాదమును కాకలి యనుటకంటె సోమనాథుఁడన్నట్లు మృదుషడ్జమనుట యుక్తతరము. కనుకనే 'ప ధ సా' అని ప్రయోగించుట దీనియందు వాడుకకు వచ్చినది.

ఇదియు ఘనరాగమే.

## ౧౫. లలిత

చాలా ప్రాచీనమైన రాగము. మతంగుఁడు దీనిని గ్రామరాగమగు 'టక్క' కు 'భాష' గా లక్షించినాఁడు. శుద్ధమైన మతంగలక్షణపాఠము లభింపలేదు. ఉన్నదానిని పట్టిచూడఁగా రి - హీనమై ధైవతద్విత్వము గలదన్నట్లు తోఁచును. అతఁడిచ్చిన లక్ష్యములో పంచమము దుర్బలముగా నుండుట గమనింపవచ్చును. ఇప్పటి యనుభవములో 'టక్క' రాగమునకు శు - రి, అం - గా, శు - మ, శు - ధ, కా - ని లే స్వరములు. దానియందుఁగల 'మ రి గ స - స ని - ధ ని ధ స, ధ మ ప మ రి గ - ఇత్యాది వక్రసంచారములు వదలి ధారాళమైన ఆరోహావరోహణలతో 'లలిత' ముగా ఈ రాగము బయలుదేరినది. రామామాత్యుని కాలానికిది మాళవగౌళమేళములో చేరినది. పంచమము పూర్తిగా వదలిన షాడవరాగముగా అతఁడు లక్షించినాఁడు. సోమనాథునికి 'లలితా' అని యొక స్త్రీరాగమును, 'లలితః' అని యొక పుంరాగమును లభించినవి. మొదటిదానికి శుద్ధమధ్యమమును రెండవదానికి ప్రతిమధ్యమమును వచ్చునఁట. మొదటిదానిని 'శుద్ధలలిత' అనికూడ అన్నాఁడతఁడు. తక్కిన స్వరాలు సమానమే. రెంటియందును పంచమమున్నను దుర్బలమే. గోవిందదీక్షితుల కాలమునకిది శుద్ధముగా 'సషాడవః పంచమవర్జనాత్' ఐనది. ముద్దుస్వామిదీక్షితులును తరువాత సుబ్బరామదీక్షితులును ఆ సంప్రదాయమునే రక్షించుకొనివచ్చినారు.

కాని యీవల 'వసంత' కును 'లలిత' కును స్పర్ధ కలిగినది. రెంటిలోను మొదట దుర్బలముగానున్న పంచమము క్రమముగా అంతర్ధానమైనది. సంగీతకళా

రహస్యనిధి రామరాజభూషణుఁడు 'వసంతము మహాసంపూర్ణభావోన్నతి' గలదిగా చెప్పినాఁడు గనుక ఆరాగమందు 'చ్యుతపంచమము' ప్రయోగించవలెనన్నారు సంగీతవైయాకరణులు! పంచమములేని రాగములలో మధ్యమస్వరము పంచమమువలె-షడ్జమువలెఁగూడ - ప్రధానమైన అంశన్యాసస్వరముగా పెరవడికివచ్చును. దానికి తరువాతిస్వరమైన ధైవతము చతుశ్శ్రుతిగా నున్నప్పుడే రెంటికిని సంవాదము ప్రబలముగా వినవచ్చును. షడ్జముతో అంతరగాంధారమునకున్న సహజసంవాదమే శుద్ధమధ్యమముతో చతుశ్శ్రుతిధైవతమునకు కలదనుట స్పష్టము. కనుక వసంతము మాళవగౌళలో పుట్టినదైనను ధైవతము తీవ్రమైపోయినది. ఆ మ - ధ ల సంవాదమును మరిగినవారి వాడుకలో లలితకును తీవ్రధైవతమే వచ్చినిలిచినది. ఫలముగా 'సీతమ్మ మాయమ్మ' అను త్యాగయ్యగారి 'లలిత' కీర్తన తీవ్రధైవతముతోనే పాడు వాడుక వచ్చినది. శాస్త్రమునకు రెండురాగములును మాళవగౌళజన్యములనియే చెప్పుట సంప్రదాయము. ఈభ్రాంతిలో కొందఱు వసంతకు శు - ధ ను, లలితకు చ - ధ ను మార్చి అంటఁగట్టినారు!

మధ్యమప్రాబల్యముచేత 'వసంత'లో ధైవతము తీవ్రమై నిలిచినది గనుక 'లలిత'ను గూడ నిలుపుకోవలెనన్నప్పుడు కొంచెము దృష్టిని మార్చుకొనవలసివచ్చును. ఇందలి అంతరగాంధారమును న్యాసాంశస్వరముగా గ్రహించి ప్రయోగించితిమేని శుద్ధధైవతము దానితో సంవాదము చూపుచు రక్తినియ్యఁగలదు. శు - మ, చ - ధ లకున్నంతదూరమే అం - గా, శు - ధ లకును కలదు గదా! గాంధారమును మధ్యమమును ఈరాగములలో షడ్జముతో సమానసంవాదముగల స్వరాలేకనుక వసంతలో గాంధారమునుగాని లలితలో మధ్యమమునుగాని వదలుకోలేము. కాని వసంతకు మధ్యమమును లలితకు గాంధారమును ప్రధానజీవస్వరాలుగా గ్రహించి పాడినచో రెంటిభేదము స్పష్టపడును. మఱి శుద్ధధైవతముతో సంవాదముగల స్వరముగనుక శుద్ధఋషభము వసంతకంటె లలితలో ప్రబలముగా తోఁచును. మరీ, గమధా మగరీ, రీగమగరీ, ధారిసరీ - ఇత్యాది ఋషభన్యాసములు ఇందు రంజించును. 'రిమగరి-సరిమగ' అని కూడ కలదన్నాఁడు తులజామహారాజు. న్యాయమే. ఇట్లే గాంధారముతో స-ప సంవాదముగల నిషాదముకూడ వసంతకంటె ఇందు ఎక్కువ ప్రత్యక్షముకాఁగలదు. నీధమగా, గగమధనీ, సనీధమధనీ - ఇత్యాదిగా ప్రయోగించవచ్చును. ధ-గలను దాఁటక, ఈడ్చి, ద్విగుణీకరించి యెక్కువగా వాడవలసినది ఈరాగతత్త్వము. మంద్రస్థాయి మధ్యమమువఱకు ఈరాగమునమాత్రము సంచారము కలదని, 'పరిసమగమ' అను ఆరోహణాసంచారముండవలెనని, చెప్పుట అంతప్రధానవిషయము కాదు. గ-ధలు దీని జీవాతువులు. వానిచేరికలో గగధా, ధగా, గగనీధగమగధా, ధగధారీ, ఇట్టు

మధ్యమమును త్రోసిరాజన్నను రక్తిచెడదు. గీతాంతమందీరాగము పాడఁదగినదని యొక సంప్రదాయము.

## ౧౯. శంకరాభరణము

మతంగ శార్ఙ్గదేవులీరాగమును గ్రహింపలేదు విద్యారణ్యుల ౧౫ మేళములలో నిదొక్కటి. పాల్కురికి సోమనాథుఁడు దీనిని పేర్కొన్నాఁడు. రామామాత్యుఁడు దీనిని గ్రహించెనుగాని శ్రీరాగమేళమునఁ జేర్చినాఁడు! దానికి ఆతనిని చెడఁదిట్టినాఁడు వెంకటమఖి. ఇప్పటి మేళాలలో ఇది ౨౯ వది. చ-రి, అం-గా, శు-మ, చ-ధ, కా-ని స్వరములుగల సంపూర్ణరాగము. సోమనాథుఁడు 'మల్లారి' మేళమున దీనినిజేర్చి ఇందలి గాంధారము మృదుమధ్యమమని, నిషాదము మృదుషడ్జమని, నిర్వచించినాఁడు. ఆనిషాదలక్షణ మిప్పటికిని చెల్లును. గాంధారము అంతరముగానే నిలిచినది. మధ్యమము గాంధారముతో కలిపి మృదువుగాకాని, పంచమముతో కలిపి కొంత తీవ్రముగాఁగాని ప్రయోగింపఁబడును. కాని శుద్ధమధ్యమ మిందు నిలుకడగానుండదు. రి - ధ లు కూడ స్వస్థానమును మీఱియే ఆడుచుండును గాంధారముగూడ రి గ రి అన్నప్పుడు ఒకమక్కుతక్కువ పలుకును. ఇట్లు స - ప లు తప్ప అన్నిస్వరములును స్వస్థానమును వదలియుండుటయే దీనిస్వరూపము. దీనిభావోన్మీలన పటిమయంతయు అందే యున్నది ఇదిగమనింపక వీణమెట్లనుగాని, హార్మోనియం - పియానా మొదలైనవాని పలకలనుగాని నమ్ముకొని శుద్ధమేళస్వరములతో పాడినప్పుడు ఈరాగము కఠోరముగా నుండును. రామామాత్యుఁడు దీనిని మధ్యమరాగమని, సోమనాథుఁడు అధమరాగమని, తలఁచిరి. వెంకటమఖి 'రాగరాజ' మనెను. ఇది ఈరాగజీవితమందలి భిన్నావస్థలను సూచించును ఇప్పటికేమో యిది రాగరాజమే. కాని శ్రుతిభేదములు చేసి పామరరంజనకై దీనిని పాడుగాయకులు కొందఱు నేఁడు దీనిని మరల అధమస్థితికే లాగుచున్నారు. మంచి నాగుఁబాముపడగలోనున్నన్ని మెలికలు, ఎక్కడతాఁకినను కివకివ క్రియఁ గలిగినదికనుకనే యీ పేరు దీనికి సార్థకమనిపించును. స ధా, స ని పా, స మ ధా పా, స ధ సా ని పా, స ప స మ రి, రి గ పా, స గ రి గ మా, స ధా గా మ - ఇత్యాదులు దీని జీవస్వరములు.

## ౨౦. శ్రీరాగము

ఇదియు చాలా ప్రాచీనమైన రాగము. కాని రత్నాకరమున దీనిపేరు కానము. పాల్కురికి కవి దీనినుల్లేఖించెను. విద్యారణ్యమతములో ఇది మేళము. చ - రి,

సా - గా, శు - మ, చ - ధ, కై - ని స్వరములు గలది. ఈ మేళమునకే ఆధునికులు 'ఖరహరప్రియ' అని పేరుపెట్టినారు. దీని యిప్పటిసంచారము 'స రి మ ప ని స - స ని ప ధ ని ప మ రి గా రి స' అని. దీనిలక్షణమును వివరించుచు గోవిందదీక్షితులు షడ్జస్థాయిలో తారషడ్జము మొదలు తారనిషాదమువఱకును గల సంచారమందు గ - ధ లను వదలవలెననియు, ఇట్లే పంచమస్థాయి మధ్యషడ్జస్థాయి సంచారములలో మధ్యమధైవతములను తొలఁగింపవలెననియు, నియమించినాఁడు. రామామాత్యుఁడు గ - ధ లు కదాచిత్తుగా వచ్చునన్నాఁడు కాని వాని వక్రసంచారమును చెప్పలేదు. సోమనాథుఁడు గ - ధ లు ఇందు వైకల్పికములని యంగీకరించినను లక్ష్యప్రదర్శనమున 'స రి మ ప ని స - స ని ధ ప మ గ రి స' అను ఔడవసంపూర్ణగతినే యాశ్రయించెను. వెంకటమఖి తండ్రిలక్షణమునకు ప్రోద్బలముగా 'గధయోః స్థానవర్జితః' అని చెప్పవలసినాఁడు. అనఁగా రి గ మ - మ గ రి, ధ ని స - స ని ధ' ఇట్టి సంచారము లేదనుట. రాగలక్షణానుబంధమున ఈ విషయమింకను స్పష్టీకరింపి ఆరోహమందు 'అల్పధైవత' మనియు, అవరోహిలో 'గవక్ర' మనియు చెప్పఁబడియె. 'అల్పధైవత' అనుమాటకు 'ప ధ ని ప - ఈ ప్రయోగము మాత్రము యే గీతప్రబంధ కీర్తనములలోఁగాని రాగాలాపన మొదలైనవిలోఁగాని యొకసారి రావలెనేగాక పలుమారు రాకూడదని పూర్వాచార్యుల మతము' అని సుబ్బరామదీక్షితులు టీక వ్రాసెను. 'రి గ రి స - ప ధ ని ప - ఇవి ఈ రాగమునకు విశేషరంజనముఁ గలిగించెడి జీవస్వరప్రయోగములు' అనికూడ ఆయనయే వ్రాసెను. విశేషరంజనము గలిగించు జీవస్వరము ఒక్కమాఱుకంటె ఎక్కువగా రాఁకూడదను నియమము వింతయైనది ! మఱి వెంకటమఖి రచించినదని చెప్పఁబడిన గీతమున ధైవతగంధమే లేదు ! ఆయనతానములోను అది ఒకటేమాఱు మెఱసి మాయమైనది. త్యాగయ్యగారి సుప్రసిద్ధరత్నమైన 'యెందరో మహానుభావులు' అను దానియందు ధైవతముకానరాదు. తులజేంద్రుని కాలమందును ఇది ధైవతరహితముగానే యుండినదని, 'స స ని ధ ప ధ ని స' అను ప్రయోగము క్వచిత్తుగా కలదని, తెలియవచ్చుచున్నది.

సంప్రదాయమును శాస్త్రమును కొంతవట్టుండనిచ్చి పరీక్షించితిమేని ఈరాగమునకు స్వరూపదానము చేసినవి 'స రి మా - మ ప సే, రి మ పా - ప ని సా' అను పరస్పరసంవాదులైన నడకలని తెలియవచ్చును. ఈ సంవాదమును పూర్తిగా నిర్వహింపవలెనన్నప్పుడు షడ్జపంచమాలవలెనే రి - మ - ని స్వరాలుగూడ స్వస్థానములందే నిలిచి నడవవలసి వచ్చినవి. కనుక గ - ధ లు, సహజముగా పరస్పరసంవా

దము లేనివి, కేవలము అనువాదులుగానే నిలువవలసినవి. పంచమమునుండి నిషాదమునకు ప్రాంతసమయమున ఊతగా ధైవతమును, ఋషభమునుండి షడ్జమునకు దిగువేళ పట్టుగొమ్మగా గాంధారమును పనికివచ్చినవంతే. కనుకనే ధైవతమున్నను లేనట్లే, గాంధారమును అతికోమలముగా, ఇందు స్ఫురించుచున్నవి. 'ప నీ' అన్నప్పుడు 'ప ధ నీ' 'స నీ' అనుచోట 'స ధ ని' అన్నట్లు ప్రయోగించితిమేని ఇందలి నిషాదము రక్తిప్రదముగా నుండును. రి - మ - ని స్వరాలను రి మా రి రి, రి పా మ మా, ప పా ని నీ ఇట్టు వళికంపితములతో ప్రయోగించినచో శ్రీరాగమంతర్ధానమై 'మధ్యమావతి' ప్రత్యక్షమగును. ఈ భేదముచేతనే శ్రీరాగము ధీరశాంతముగాను, మధ్యమావతి ధీరోద్ధతముగాను, స్వరూప వైశిష్ట్యమును సంపాదించుకొనును. ఇది గమనింపనివారి పాటలో కట్టకడపటి శాస్త్రపుతునక 'ప ధ ని ప' వినబడువరకును 'ఇది శ్రీరాగమా మధ్యమావతియా?' అను సందేహము తెగదు. అట్లు తెగియు ఫలములేదు.

ఇదియు ఘనరాగము. సర్వవిధముల శుభప్రదాయకమైన రాగరాజమని దీనిని పలువురు ప్రాచీనులు పొగడినారు.

## ౨౧. సామంతము

విద్యారణ్యులకంటె ప్రాచీనుల గ్రంథములలో ఇది గానరాలేదు. రామామాత్యుడు, గోవిందదీక్షితులు, సోమనాథుడును దీనిని లక్షించినారు. ముగ్గురును దీనిని మేళముగా గ్రహించినారు. ముగ్గురిమతమునను దీనికి ష - రి, అం - గా, శు - మ, ప - ధ, కా - ని స్వరములు వచ్చును. గోవిందదీక్షితుని లక్షణముప్రకారము నాటకును దీనికిని భేదమేమో తేలదు. గ్రహాంశన్యాస సంవాది వివాదులును తుల్యములే. రామామాత్యుడు దీనిలోని గాంధార నిషాదములు అంతరకాకలులని, నాటలోనివి చ్యుతమధ్యమ గ - చ్యుతషడ్జ ని - లని లక్షించెను అనగా నాటలోని గ - ని స్వరములు అంతరకాకలీ స్థానములకంటె ఒక శ్రుతి యెక్కువగా పలుకునట. సోమనాథుడును ఇట్లే ఈ రెంటికిని భేదముచూపెను.

తండ్రిమతమును దాసించి వెంకటమఖి ఇందలి ఋషభము పంచశ్రుతియని నిర్ణయించెను. నిషాదగాంధారములు కాకల్యంతరములే. కనుక ఒక ధైవతము తప్ప తక్కినవన్నియు శంకరాభరణస్వరాలే కనుకనే ఆయన దీనిని 'శంకరాభరణచ్ఛాయః' అన్నాడు. రామామాత్యుడు శంకరాభరణమును లక్షించుచు

'సామంతచ్ఛాయమాశ్రితః' అన్నాడు! - దీని సంచారక్రమము ఎవరును విశదముగా చెప్పలేదు. సంపూర్ణమని మాత్ర మన్నారు. వేంకటమఖిపేరి రాగలక్షణానుబంధ మున 'ఆరోహేవక్రధైవతః' అన్నికలదు. 'ప ని ధ ని స' అని సంచరింపవలె నన్నమాట. కాని సుబ్బరామదీక్షితులు ప్రకటించిన వెంకటమఖిగీతమున 'పధనిస' సంచారము స్పష్టముగానున్నది. అంతకంటె ఎక్కువగా 'ప ని స' అను ధైవ తలంఘనము కానవచ్చుచున్నది. స ని ధ ప - స ని ని ప అనియును సంచరించినది చూడవచ్చును. కాని సుబ్బరామదీక్షితులు 'స ని ధ ప యని యీ రాగమువలె అవరోహణమందు క్రమముగాదిగుట షట్శ్రుతిధైవతములు కలసిన తక్కిన యేరాగముల యొక్క అవరోహణములందును కనుబడలేదు' అనియు, మఱొక్కచోట 'ఈసామంతరాగమూర్ఛనావరోహణములో మాత్రము (స ని ధ ప మ గ రి) యని వివాది దోషయుక్తమై ప్రాచీనపుస్తకములో వ్రాయబడియుండుట లేఖకుల పొరబాటని యెంచ వలసినదిగా నున్నది' అనియు వ్రాసెను. కాని అట్లు తలంప బనిలేదనుకొందును. ష - ధ, కా - ని స్వరములను ధా నీ - నీ ధా అన్నట్లు స్పష్టముగా చేర్చి యీడ్చి పట్టినచో వివాదిదోషముండుట సత్యమే. కాని ధ నీ - ని ధా అని యొకదానిని హ్రస్వపఱచి రెండవదానికాధారముగా ప్రయోగించితిమేని ఆదోషము వినబడదు. ఇదినే అల్పత్వపద్ధతి యందురు. రెండవది లంఘనపద్ధతి. రెంటిలో నొకటిని వదలుట ప ని పా - స ని పా అన్నట్లు. ఈదృష్టితోనే ప్రాచీనులీరాగమునకు లక్ష్యము చెప్పిన ట్లు కానబడును. కాని ఇందులో ప ధ సా - స ధ పా ఇట్టి నిషాదలంఘన ప్రయోగములు కానరావు. నిషాదమును విస్పష్టముగా పట్టి, ఋషభమును దుర్బలముగా అనువాదిస్వరముగా మాత్రము ప్రయోగించుకొని, ప ని స - స ని ప లతో స ని ధా ప, ప ధా ప - ఇట్లు ధైవతమును కలుపుకొనుచు, అంతరగాంధారమును కాకలినిషాద మును వలెన్యాసస్వరములుగా గ్రహించి ఆలాపించినయెడల ఈరాగము స్వతం త్రమై స్ఫురించును. అప్పటికి నిషాదగాంధారములందు వివాదిస్వరములని చెప్పిన వెంకటమఖిమాట విరోధించునుగాని అతని వివాదసంవాదములు రాగములలో ఇప్పుడు మనకంతగా ఆప్తముకావివి. ఈపద్ధతిలోను కొంచెము ఏమఱితిమేని 'నీలాంబరి' రాగము ప్రవేశించును. తాళ్ళపాకపాటలలో 'నీలాంబరి' చాలా అరుదుగానున్నది. తులజా మహారాజు చేర్చనలేదు. రామామాత్య సోమనాథులును అంతే. కనుక పూర్వ కాలమున నీలాంబరికి అంతగా వ్యాప్తియుండలేదేమో అని, సామంతములో శంకరా భరణము మ్రింగివేయఁగా మిగిలినభాగమును నీలాంబరి అపహరించుకొని పెద్దదైనదేమో యని, సందేహింప వీలున్నది. తాళ్ళపాకవారు చాలా ప్రీతితో వాడినరాగములలో నిదయొకటి. కనుక ఆరాగమును పునరుద్ధరించవచ్చునని నా యాశ. కొందరాస్తానవా

D

భమును, పంచమము నందుకొనుటకు దైవతమును ఊఁతగా వచ్చును, అంతే. గ - మ - ని స్వరములు తమతమ చోట్లలో దిట్టముగా దీర్ఘముగా, జంటలుగా నిలిచి స్ఫురించును. రి - ధ లు గూడ అవరోహగతిలో జంటలుగా మెఱుఁగిచ్చును. దైవతమునకు రిషభముతో మాత్రమే సంవాదము. రిషభమునకు పంచమముతో అంతకంటె దృఢమైన సంవాదముగూడఁ గలదు గనుక దైవతమునకంటె దానికీరాగమున చాలవ కొంత యెక్కువగా నిచ్చినను రంజనగానేయుండును. అట్లే సగసా - మగసా - సనిపా - పనిపా - ఇట్లు రి - ధ లను త్రోసినను రక్తి చెడదు. గ - మ - ని స్వరములను కంపిత గమక భేదములతో ఊఁచినచో రాగము స్వరూపము నందగించును.

త్యాగయ్యగారి సుప్రసిద్ధమైన 'నగుమోము' అను కృతి ప్రకృతమీ రాగమందే నిలిచినది. ఆహిరి రాగపు రూపాంతరమై ఆభేరి అనుపేర, 'సమగమపస - సనిధపమగరిస' అను శుద్ధదైవతముతోడి సంచారమును పట్టుకొన్న ఆరాగము, రిషభ సంవాదమువలన దైవతము సహజముగా తీవ్రమైపోఁగా, పేరుమాత్రము వదలలేదుగాని, పూర్తిగానే ఈ ప్రాచీన దేవగాంధారిలో కలసిపోయినది.

## ౨. కేదారగౌళ

దీని నిర్వచనము మొదటి సంపుటమున ఇయ్యఁబడినది. (పు. ౬.) అందు ఈ 'రాగమంత ప్రాచీనముగాదు' అన్నమాటను సహృదయవిమర్శకులొకరు ఆక్షేపించిరి. ఎంతో ప్రాచీనకాలమునుండియు ఈ రాగము జనప్రియమై పురాణ ప్రవచన నాటకాదులలో వ్యాప్తిలోనున్నదనియు, ద్రావిడ సంప్రదాయమున దీనికి 'గాంధార పంచమము' అను పేరు కలదనియు, సుమారు రెండువందల యేండ్లక్రింది వ్రాఁత పుస్తకమొకదానిలో 'గాంధార పంచమమనఁగా కేదారగౌళయే' యని యున్నదనియు వారన్నారు. కాని రత్నాకరమందు గాంధారపంచమము నిర్వచించుచు శార్ఙ్గదేవుఁడు ఇచ్చిన లక్షణ లక్ష్యములను చూచితిమేని ఇప్పటి కేదారగౌళకును దానికిని సంబంధములేదని తెలియఁగలము. (అధ్యా. ౨. ౧౦౩.) అతఁడు కేదారగౌళను పేర్కొనలేదుగాని 'గాంధారపంచమి' అను మఱొక్కరాగమును లక్షించిన వ్యాఖ్యాత కల్లినాథుఁడు (పు. ౧౧౪.) మూలకర్త పేర్కొన్న 'దేశవాల' రాగము కేదారగౌళయే అని వ్రాసినాఁడు! (౨ - ౧౧.)

## ౩. గుండక్రియ

గుండక్రియ, గుండక్రీ, గుణకరి, గుండకృతి, గౌండక్రీ, గౌడక్రీ - ఇత్యాదిగా ఈ పేరు పలుమార్పులు చెందినది. ప్రాయశః దీని ప్రాచీనరూపము గౌడక్రియ కావచ్చును. తుదకు 'గుండక్రియ' అనఁగా గుండ్లను కరఁగించు శక్తిగలది అను వింత వ్యాఖ్యానమునకుఁగూడ ఇది దారితీసినది! మతంగుఁడు దీనిని పేర్కొనలేదు.

రాగాంగ భాషాంగో పాంగ క్రియాంగములని పూర్వకాలమందొక రాగ విభాగముండినది. ఆశబ్దములు నేఁడును ఎందఱో వాడుచున్నారు. కాని ఆ విభజనకు మూలమైన అర్థమెన్నఁడో అంతరించినది. అందు క్రియాంగములనఁగా 'కరుణ, ఉత్సాహము, శోకము మొదలగు భావములు ప్రబలముగానున్న క్రియగలిగినప్పుడు ఈ రాగములు పుట్టును గాన వీనికా పేరు వచ్చినది' అని రత్నాకరవ్యాఖ్యాత కల్లినాథుఁడు చెప్పినాఁడు. (౨, ౨, ౧.) అట్టివి 'భావక్రి' మొదలైన క్రియాంగ రాగములు పండ్రెండు పూర్వకాలమందుండినవని, తనకాలమందు రామక్రియ, గౌడక్రియ, దేవక్రియ అను మూఁడుమాత్రమే వ్యాప్తిలోనున్నవని, రత్నాకర కర్త వచించెను. (౨. ౨. ౧౩.) దానికి రి - ధ స్వరములు లేవని, మధ్యమ పంచమములెక్కువగా వాడవలెనని, గ్రహాంశ న్యాసములు షడ్జమని, అందలి లక్షణము. (౨. ౨. ౧౨౮.)

పాల్కురికి సోముని పండితారాధ్యచరిత్రలో 'తోడి దివ్యావతి దుండక్రియ' (పర్వత ప్ర. ౪౫౫.) అని యతిస్థానమందున్నది కాని క్రిందీ సూచికలోని 'గుండక్రియ' అను పాఠమే యుక్తము. తోడికి తోండి యని ప్రాఁత రూపము. తుండి యనియుఁ గలదు (సంగీ - మక: పు. ౧౮.) ప్రాసయతి సోమనాథుని ద్విపదయందలి విశేషముగదా. మరి 'దుండక్రియ' ఇంకెవరును పేర్కొన్నది గాదు.

సంగీత సమయ సారమున 'షడ్జాంశన్యాస సంయుతా - రిధత్యక్తా' అని గుండకృతి లక్షణము. తక్కిన స్వరముల కాందోళితము చేయవలయునట. (అధికరణం. ౩.)

మదనపాలుని 'ఆనంద సంజీవనము'న గుండక్రి రి - ధ లు లేనిదని, గ్రహాంశ న్యాసములు షడ్జమని, క్రియాంగమని కలదు. (పు. ౧౫.) సోమరాజు 'సంగీతరత్నావళి' యందును ఇట్లే * (పు. ౧౦౦.)

చతుర దామోదరుని 'సంగీతదర్పణము' గుణకరి రి - ధ హీనమని, గ్రహాంశన్యాసములు నిషాదమని, కొందఱు షడ్జమే అందురని, ఔడవమని తెల్పుచున్నది. భైరవరాగమునకిది స్త్రీ యట. అది సోమేశ్వర మతమని, హనుమంతుని మతమందిది కౌశికరాగము భార్యయని అందున్నది.

గోవిందుని రాగతాళచింతామణి ఇది మాళవగౌళ మేళజన్యమని చెప్పి (అ. ౪ - ౧౦.)

'త్యక్త ధైవతమయ్యును, ధైవతాఢ్య
మగుచు నొకయెడ, సగ్రహ న్యాసకాంశ
ముఖ్య షాడవ గుండక్రి మొదటిజాము
వేళ నింపొందు' అని లక్షించినది. (అ. ౪ - ౧౨౨.)

రామామాత్యుని మతమును ఇదే. (స్వ. మే. క. రాగప్ర. ౫౪.)

* ఈ రెంటి వ్రాఁతప్రతులు తిరుపతి శ్రీ వేం. ప్రాచ్యపరిశోధనాలయ గ్రంథభాండాగారమునఁ గలవు.

రాగవిబోధమున సోమనాథుడు, గౌండక్రియ మాళవగౌళ మేళమందలిదని (౩-౪౧) ధైవతము వర్జ్యమని, షడ్జమే దీని గ్రహాంశన్యాసములని నిర్దేశించెను. (౪ - ౧౮.)

గోవిందదీక్షితుడు 'సంగీత సుధ' లో గుండక్రియ గుర్జరి మేళమందలిదని, సంపూర్ణ మని చెప్పెను. (ప. ౨౬౬.) వేంకటమఖి తండ్రిమాటనే అనువదించెను కాని గౌళమేళ మనెను. రెండును ఒకేజాతి స్వరములు గలవే గనుక ఇద్దరి రాగస్వరూపములును ఒకటే. (చతు. రాగ. ౨౧.)

రి - ధ స్వరములు కోమలములే యని చెప్పినను 'గుణక్రియ' కు గ - ని స్వరములు వర్జ్యములని, అపరూపముగా గాంధారము చేరవచ్చునని, అహోబలుడు దీనికి క్రొత్తరూపము చూపినాడు. (సం. పారి: ప. ౪౦౬.) అతడిచ్చిన ప్రయోగమున క్వాచిత్కముగా 'స రి గ గ మ గ రి సా' అనియు కలదు.

ఇట్లు ఇది ఔడవముగా షాడవముగా సంపూర్ణముగా వైవిధ్యమును దాల్చిన రాగము. మాళవగౌళ మేళముగా ఏర్పడిన తరువాత ఇందలి భిన్నసంచారములు వేఱు వేఱు రాగములై రూపుగొనుటచే ఈ రాగము వెనుకబడినది. త్యాగయ్యగారి 'ఇంతనుచు వర్ణింప తరమా' అనుకృతి దీని ఉనికను శిథిలముగా పట్టుకొనియున్నది. దానికి వాడుకలోని సంచారము 'స రి మ ప ని సా - స ని ప ధ ప మ గ రి సా' అని విచిత్రమైనది. కాని గౌరి, గౌళ, గౌళిపంతు మొదలగు రాగములకంటె భిన్నమైన స్పష్టస్వరూపము నిచ్చుటకు ఆ సంచారము చాలదు.

ముత్తుస్వామిదీక్షితుల సంప్రదాయము, దానికి మూలమగు వెంకమఖి దీర్ఘగీతమును ఈ రాగస్వరూపమును వైశాల్యముగ తెలుపుచున్నవి. 'రాజ రాజేంద్రచోళ' అను కృతి దీక్షితుల రచనకలదు. (సం. సం. ప్ర. ౬౩౮, ౭౪౨.) ఈ రాగమును లక్షించుచు సుబ్బరామ దీక్షితులు 'సా రి గ మ ప ధ ని స - స్సా ని ప మ గ మ ధ ప మ గ రి సా' అని సామాన్య సంచారమును చూపి, రాగముల మూర్ఛనలను సంగ్రహించినచోట అనుబంధ ముగా 'గుండక్రియ, దీనికి గ మ ప ధ ప, ప రి మ రి మ ప ధ స, స మ గ స రి రి సా - ఇవియును విశేషప్రయోగములు' అన్నారు. (పు. ౮.) కాని 'ప ధ ని సా' అను ప్రయోగము వెంకటమఖి దీర్ఘలక్షణగీతము కడపట ఒకమారుమాత్రమే వచ్చినది. ముత్తు స్వామిదీక్షితుల కీర్తనలో లేనేలేదు. సుబ్బరామదీక్షితుల 'సంచారి' లో 'ప ధ ని ప - ధ ని ప' అని రెండే ప్రయోగములున్నవి. తక్కిన చోట్లనెల్ల ప ధ సా - స ని పా అను సంచారమే పర్యాయకముగానున్నది. 'అవరోహణమందు అల్పధైవతము' అని సు. రా. దీ. గారిచ్చిన లక్షణము లక్ష్యములో కానరాదు. ఆరోహణమున ధైవతమునుగాని అవరో హణమున నిషాదమునుగాని న్యాసముగా నిలువక, స - మ - ప స్వరములే న్యాసములుగా నిర్వహించుచు, స రి మా, మ గ మా, మ గ స రి ప మా, మ గ మ ధా, ధ ప ద సా, స ని స రి స రి సా ని పా మా, స రి గ మ పా. ఇత్యాది సంచారములచే

ఈ రాగమును రూపుగొలుపవచ్చును. మధ్యమము ప్రధానస్వరమగుటచే ప్రబలమై గాంధారము నణఁచిపెట్టును. కనుకనే 'స రి మా, సంచారము. మ గా మా - స నీ సా అని గాంధార నిషాదములు మధ్యమ షడ్జముల నంటిపెట్టుకొనియే నడచును. మొత్తముమీఁద ఇది అనేక ప్రాచీన రాగములవలెనే ఆరోహావరోహముల యంతస్తును మీఱి అనుసంధింపవలసినది. ఈ దృష్టితోనే ఈ సంపుటమందలి రెండు సంకీర్తనలందు ఈ రాగస్వరూపము సంతరింపఁబడినది.

## ४. తెలుఁగు కాంభోది

ఇప్పటి యదుకులకాంభోజికి పూర్వరూపము ఎరుకలకాంభోజియని, దాని ఇతరులు వ్యవహరించిన రూపము తెలుఁగు కాంభోజి కాఁదగునని ఈ పాటల తొలిసంపుటమున తెలిపినాను. రాగమేమో అసాధారణ మాధుర్యబలముతో దక్షిణదేశమంతటను మన్ననగొన్నది. మరి ఉత్తరదేశమునందును తిలక్ కామోద్ అని యుచ్చారణభేదముతో, సులభీకృతమైన స్వరరూపముతో, జనరంజకముగా వ్యాపించి నెలకొన్నది. కాని దీని స్వరూపమును ప్రాచీను లెవరును వివరించినట్లు తోఁపదు. వెంకటమఖి పేరనున్న రాగలక్షణానుబంధమున మాత్రము,

'ఆరోహే గని వర్జ్యశ్చ సగ్రహః సార్వకాలికః
స్యాదేరుకులకాంభోజీ రాగ ఇత్యుచ్యతే బుధైః' (చతుర్దం. అను ; ప. ౧౨.)

అను శ్లోకముగలదు. కాని అది యీ రాగపు స్వరూపమును ఏమియు తెలుపఁజాలని లక్షణము. సుబ్బరామదీక్షితులే కొంత లోఁతుగా దీనిని వివరించినారు. (సం. సం. ప్ర. ౯౦౩.)

స రి మ ప ధ ని ధ మ ప ధ సా - సా ని ధ ప మ గ రి సా - అని వారిచ్చిన సామాన్య సంచారము. కాంభోజియందు మధ్యమ నిషాదములు దుర్బలములు; ఇందు గాంధార నిషాదములు. మరి నిషాదము కైశికిగాని కాకలిగాని కాంభోజికంటె ఇందు దుర్బలము. ఈ రాగమున అది లేదని చెప్పినను చెల్లును. షడ్జము నంటుకొని కాకలియు ధైవతముతో తగులుకొని కైశికియు ఈఁతగా మాత్రమే రాఁగలుగును. మధ్యమము ప్రబలమైనను స్వస్థానమందు నిలువక గాంధారమూఁతగా గ మ గ మ గ మ అన్నప్పుడు తక్కువగాను, ప మ ప మ ప మ అన్నప్పుడు ఎక్కువగాను సంచరించును. రి - ధ లు రెండును పరస్పరసంవాదముచేత ప్రబలములైనను కంపితగమనముతోనే రి గ రి గ రి గ ధ ని ధ ని ధ ని అన్నట్లు స్ఫురింపును. ధైవత మొక్కప్పుడు స్వస్థానమందే దిట్టముగా దీర్ఘముగా నిలిచి రాణించుటయుఁ గలదు. రి - మ - ధ లు మూఁటియందును రాగపు పలుకులను న్యాసము చేయవచ్చును. గాంధారము దుర్బలమైనను షడ్జముతో తనకు సహజముగాఁగల సంవాదాధికారమును ఒక్కొక్కవేళ చెలాయించును. అప్పుడు రి - మ లు దుర్బలములై త్రోవ విడుచును. మ గ స రీ మా, మ గ మ పా, స రి మాఁ గ మ ప దా, సాఁ ధా, ధ ప మా, ధ ధ సా ధ ప మ గ స రి మ ప ధా, ధ స ధ సాఁ ని ద, ప ధ స పా మ గ రి మ గ

సరి, ఫ ఫ ఫ ఢ సా - సా ని సరిగ సరి, సరి గా గా గా, గా మ పా మ గా మ గా రి రి, స ఫా ఫ సా. ఇత్యాదులు ఈ రాగపు హృద్యమార్గములు. విలంబ ప్రధానమైన మధ్యలయము దీని జీవాతువు.

## ౫, నారణి దేశాక్షి

నారాయణదేశాక్షి అనియు దీనినందురు. నారాయణిని దేశాక్షిని వేఱుగా ఎందఱో లక్షించినారు కాని ఆ రెండును గలిసిన యీ రాగమును ప్రాచీనాధునికులలో మతంగుఁడు, దత్తిలుఁడు, పాల్కురికి సోముఁడు, శార్ఙ్గదేవుఁడు, పార్శ్వనాథుఁడు, నారదుఁడు, అహోబలుఁడు, సోమనాథుఁడు, గోవిందుఁడు, రామమంత్రి మొదలగువారు పలువురు పేర్కొనలేదు. గోవిందదీక్షితుఁడు శంకరాభరణజన్యమని, గ్రహాంశన్యాసాలు గాంధారమని, సంపూర్ణమని చెప్పెను గాని వివరింపలేదు. (సంగీ. సు. ప. ౧౧౨౦.) కుమారుఁడు వేంకటేశ్వరమఖి దానినే అనువదించి ప్రాతఃకాలము పాడఁదగినదని మాత్రము విశేషమును చూపెను. (చతు. ప్ర. రాగప్ర. ౩౪, ౮౧.) తాళ్ళపాక సంకీర్తనలలోను ఈ రాగము క్వాచిత్కమే. సుబ్బరామదీక్షితులు ప్రకటించిన 'వెంకటమఖి' గీతమొకటి, సొంతరచనయైన సంచారి - ఇవి తప్ప వేఱు లక్ష్యములేవియు కానరావు. (సం. సం. ప్ర. ౯౩౨.)

సు॰ రా. దీ. ఇచ్చిన దీని సంచారము వర్జ్యవక్రములులేని సంపూర్ణము. శంకరాభరణ మేళము. ఆయన చేసిన వివరణమునుబట్టి రిమ, ధస - ఇట్లు గ - ని స్వరాలను విడిచి సంచరించవచ్చునని, జంటలుగా రి - ధ స్వరములను స్ఫురిత ప్రత్యాహతములతో నడపవలెనని, ఇతర గమకములకెక్కువ చోటిందు లేదని, ఆ రెండు స్వరములే జీవన్యాస స్వరములని, తెలియవచ్చుచున్నది.

## ౬. భూపాళం

మతంగుఁడు దీనినెత్తలేదు, రత్నాకరములో భూపాలి పేరు లేదుగాని అందు పేర్కొనఁబడిన 'దోంబక్రి' అను రాగమే భూపాలికి పర్యాయమని కల్లినాథుఁడు టీకించెను. (౨. ౨ - ౧౧.) నారదుఁడు ఇది షాడవమని, గాంధార గ్రహమని, షడ్జమిందు వర్జ్యమని, చెప్పెను. (సంగీ. మక. ౩ - ౪౪.) పాల్కురికి సోముడు దీనిని గ్రహించెను. (పండి. పర్వ. పు. ౪౫౫.)

దీనిని వేఱు వేఱు లాక్షణికులు మూఁడురకములుగా నిర్వచించినారు :

౧. రామామాత్యుఁడు, పోలూరి గోవిందకవి, గోవిందదీక్షితులు, ఇది మ - ని వర్జ్యమైన ఔడవరాగమని పంచశ్రుతి రి, సాధారణ గ, శుద్ధ ధ లు ఇందు వచ్చునని చెప్పినారు. మొదటి యిద్దఱును దీనిమేళము హిందోళమని చెప్పఁగా, గోవిందదీక్షితులు భైరవి మేళమన్నాఁడు. పై యిద్దఱిమతమునను హిందోళమునకు రిషభము పంచశ్రుతులు గలదే గనుక

ముగ్గురి మేళస్వరములును ఒక్కటే. (స్వరమే. ౫. ౫౬ ; రాగతా. అ. ౪. ౧౯. ౧౩౬ ; సంగీతసు. ప. ౧౦౪౦ - ౪౧.)

౨. సోమనాథుని మతమునను ఇది ఔడవమే. మ - ని లు లేనిదే. కాని ఇది మల్లారి మేళమున జనించినది. దాని స్వరములు తీవ్రతర రి, శుద్ధ స మ ప, తీవ్రతర ధ, మృదు షడ్జములు. అనఁగా గ - ని స్వరములును తీవ్రతరములే అనుట. ఇందు జనించి మ - ని వర్జితమైన భూపాలి ఇప్పటి మోహనరాగమగును. ఔత్తరాహులు నేఁడును 'భూప్' అను పేర ఈ రాగమే పాడుచున్నారు. (రాగవిబో. ౨ - ౫౩, ౪ - ౩౬ )

౩. వేంకటమఖి తండ్రిమతమునకు విరోధముగా భూపాలమే శు - రి. సా - గ. శు - మ. శు - ధ. కై - ని స్వరాలు గల మేళముగా స్వీకరించి అందు మ - ని లేని ఔడవ రాగముగా దీనిని లక్షించినాఁడు. (చతు - ప్ర. ౪ - ౧౧౧, ౫ - ౬౧.) కాని అతని పేరిటి రాగలక్షణాప్రబంధమున భూపాలమును ౯-వ మేళమగు భిన్నషడ్జమున కలిపినారు. (పు. ౭.) సుబ్బరామదీక్షితులు ఆ మతమే గ్రహించెను. (సం. సం. ప్ర. ౧౧౧.) తచ్ఛ్రాసి సోదరులు 'గాయక సిద్ధాంజనము'న భవప్రియమేళమందును 'గాయకలోచనము'న హనుమతోడి యందును జన్యముగా పరిగణించిరి. ఎట్లైనను శు - రి. సా - గ. శు - ధ స్వరాలు కల ఔడవరాగమిదియని వారందఱి మతమనుట నిస్సందేహము. తరువాతి వారందఱును ఈ మతమువారే.

పైమూఁడు విధములలో మొదటిది, రిషభమునకు తగిన సంవాదిస్వరమింకొకటి లేక, ఉన్న పంచమము షడ్జముతోడి ప్రబలసంవాదముతో పరవశముకాఁగా, స్వరూపమును నిలుపుకోలేక పోయినది. రెండవది 'మోహన' నామముతో మనలో వెలకొన్నదిగదా. ఒకానొకకాలమున దీనికి 'రేగుప్తి' అను పేరుగూడ మనలోనుండినదని యూహింపవలసి యున్నది.

మూఁడవది, అంతర గాంధారముగల 'బౌళి'ని పాడి మరగిన మనగాయకుల నోట సరిగా మెదలక మనకు మసకుగానున్నది. తిరుమలయ్యనాయఁడు 'గాన విద్యాసంజీవని' (పు. ౪౪.) లో ఇది హనుమతోడి జన్యమనిచెప్పి 'ఇప్పటిలో ఈ రాగము నామమాత్ర ప్రసిద్ధము. వాడుకలో బౌళియే పాడుదురు' అని క్రింది సూచికలో చెప్పెను. సుబ్బరామ దీక్షితులును 'ఈ భూపాలరాగ గాంధారమును సంప్రదాయముఁ దెలియని నవీనులు అంతర గాంధారముగాఁ బట్టుచున్నారు. ఇటులఁ బట్టి పాడితే సకలశుభముల నెటులనిచ్చును: లక్షణకారులు జెప్పినప్రకారము సాధారణ గాంధారముఁజేర్చి పాడితే సకలసంపదల నొసఁగుటకు సందేహములేదు.' అని వగచెను. (పు. ౧౧౧.) గాంధారము సాధారణముగా నుండక తీవ్రముగా మారుటకు షడ్జముతోడి సహజ సంవాద సుఖలోభమే కారణము. కనుక భూపాలియే బౌళిగా మారినది. బహుళి, భవుళి అనిగూడ బౌళికి పేరున్నను ఆ పేరుగూడ భూపాలి శబ్దభవమే అనుకొన వీలున్నది. కాని సాధారణ గాంధారమునకు పంచమముతో

స - గ సంవాదమును, ధైవతముతో స - మ సంవాదమును కలదని గ్రహించి ఆ దృష్టితో పాడినచో ఈ రాగమునకొక విశిష్టత కలదు. విలంబ ప్రధానముగా - గా దా, దా గా రీ, సా పా సా, గ గ ధ ధ పా, రి రి ధా, ధ ధ రి రి గ రి స రి ధా, స పా స రీ పరీ గ పా - ఇట్లు సంచరించుట దీని స్వరూపరక్తులకు సాధకము. గ - ధ లు జీవ స్వరములు. ఇది ఉదయరాగమని సర్వలాక్షణికుల మతము.

## ౭. మలహరి

రత్నాకరమున తనకాలమున ప్రసిద్ధములైన ౫౨ రాగములలో. 'మల్లారి' ని శార్ఙ్గదేవుఁడు పేర్కొన్నాఁడు. (౨. ౨. ౧౭.) పంచమరాగమునకు భాష దాక్షిణాత్య; దాని విభాష ఆంధాలిక; దాని యుపాంగము మల్లారి, అని దీని పరంపర నతఁడు చెప్పెను. కాని మనకిది సుగ్రహముకాదు. పాల్కురికి సోముఁడు దీని నెఱుఁగును. (బసవపు. పు. ౯౦; పండి. పర్వ. ౪౫౪.) సంగీతమకరందమున మహ్లార - మహ్లారి రెండును గలవు. రెండవది దీపరాగము భార్య (పు. ౧౮ - ౧౯.)

మదనపాలుని ఆనందసంజీవనమున, ఇది షడ్జపంచమవర్జితమైన ఔడవముగా ధైవతము గ్రహాంశన్యాసములుగా చెప్పఁబడినది. (పు. ౧౬.) దామోదరుఁడు సంగీతదర్పణమున (ప. ౨౬౨.) ఈ మతమే చెప్పెను. మరియు మల్లారి మేఘరాగ భార్యయట. (ప. ౧౮౯.)

సంగీతసమయసారమున 'మల్లారి' ఆంధాళికంగమని, గ - శూన్యమని, మధ్యమము దీని గ్రహాంశములని, రిషభము మంద్రమని, తాడితస్వరములు గలది యని, 'మల్లారి' రాగమునకు గ - ని లు రెండును లేవని, పంచమము స్ఫురితగమకములో నడచునని యున్నది. (అధి. ౪. ౬౮ - ౬౯.)

సంగీతసుధ గుర్జరీమేళమున (మాళవగౌళ) జన్యమని, న్యాసగ్రహాంశములు ధైవతమని, నిషాదములేని షాడవమని మలహరిని వర్ణించినది. మరియు 'కేచిత్ ప్రవీణాస్త్వవరోహణేఽస్యాః గాంధారసత్తామపి వర్జయంతి*' - అనఁగా కొందఱు వైణికులు దీని అవరోహణమందు గాంధారమునుగూడ వర్జింతురు - అని చెప్పినది. (ప. ౭౨౮.) వెంకటమఖి అమాటే అన్నాఁడు. మేళముమాత్రము గౌళమన్నాఁడు. (చతు - ప్ర. రాగప్ర. ౩౭, ౯౨.) కాని రాగలక్షణానుబంధములో 'ఆరోహేతు గవర్జితః' అని యున్నది. (ప. ౧౫.)

రామామాత్యుని మతము సందిగ్ధముగానున్నది. తక్కిన విషయములు సమానములైనను 'ఔడవో గ - ని వర్జ్యోఽసౌ' అని ముద్రితపాఠమును 'ఔడవ స్సపవర్జ్యోఽసౌ' అని వ్రాఁతప్రతి పాఠమును గలవు. (స్వరమే. ౫ - ౩౭.) స - ప లు లేనిచో మదనపాల దామోదరుల మతమగును. గ - ని వర్జితమైనచో పార్శ్వనాథుని మతమగును.

---

* 'వర్జయన్తి' అని ముద్రణ పాఠము ;

C

గోవిందుడు ఇది మాళవగౌళ మేళమందు,

> “వరుస గాంధారక నిషాద వర్జనమున
> నౌడవంబైన మలహరి యమరె సగ్ర
> హాంశకన్యాస ధన్యమై యమరి యుదయ
> రాగమిది యన.... ” అని స్పష్టపరిచెను. (రాగతా. చిం. ౪ - ౫౫.)

సోమనాథుని ప్రకారము మల్లారి, నటమల్లారి అని రెండువిధములు. మొదటిది మేళము ; రెండవది జన్యము. కాని రెంటికిని భేదము సుగ్రహముకాదు. అతఁడిచ్చిన లక్ష్యమున రెండును ప్రాయశః గ - ని వర్జితములగు ఔడవములే ; గాంధార ప్రయోగము వకన్న నిషాదము ఇంకను క్వాచిత్కము. (రాగవి. ౪ - ౩౫, ౫ - ౬౫, ౭౦.) మల్లారిమేళమందు రి - ధ లు తీవ్రతరములు. ఈ రాగమే వేఱు. మనలో వ్యాప్తికిరానిది.

ఇప్పటి సంప్రదాయము ప్రకారము ఇది ౧౫-వ మాళవగౌళమేళమునకు చేరినది. ‘స రి మ ప ధ సా స ధ ప మ గ రి సా’ అను ఔడవ షాడవగతిగలది. పురందరదాసుల ‘లంబోదర’ ఇత్యాది నాల్గు ఈ రాగపు గీతములు నేర్వని కర్ణాటక సంగీతవిద్యార్థి యుండఁడు. ముత్తుసామిదీక్షితుల ‘పంచమాతంగ’ అను కృతి ఈవల కొంత వ్యాప్తి గాంచుచున్నది. త్యాగయ్యగారి రచన యీ రాగమున కానరాదు. మొత్తముమీఁద ఎక్కువవ్యాప్తి కవకాశము లేని రాగమిది. మధ్యమమును ధైవతమును శుద్ధముగా స్వస్థానములందు న్యాసాంశస్వరములుగా విన్యసించి పాడినచో కొంతరక్తినిచ్చును. ధ ధ స మ మ ప మా, ప ధ స ధా మ గ రి రి మా, స రి స ప మ గ రీ, స ని స రి ధా. ధా రీ రి, సా - ఇత్యాది ప్రయోగములు రంజకములు.

౮. మాళవిగౌళ

ఇప్పుడిది వెంకటమఖిమేళప్రకాశికలో ౧౫-వది. సంగీతవిద్యార్థులకు మొదలు స్వరావళి దీనియందే నేర్పుట ఎంతకాలమునుండియో సంప్రదాయమైనది. కాని ప్రాచీన కాలమున దీనికి వ్యాప్తి తక్కువ యనవలసియున్నది. మతంగుఁడు, పార్శ్వనాథుఁడు, దత్తిలుఁడు, శార్ఙ్గదేవుఁడు, కల్లినాథుఁడును దీని పేరెత్తలేదు. పాల్కురికి సోముఁడు దీనిని స్మరించినాఁడు. (పండితా. పద్య. ౪౫౫.) నారదుఁడు పురుషరాగములలో దీని నెత్తి కొన్నాఁడు. మాలవగౌళకః, మాలవగౌడః అను రెండురూపములును అందున్నవి. (సంగీ. ము. పా. ౩ - ౧౬, ౫౪.) మాలవీగౌడ అని మదనపాలుని ఆనందసంజీవిని పేర్కొని గ్రహాంశన్యాసములు దీనికి రిషభమని (నిత్రయ :— రిత్రయః : ?) ని - ప (రి - పః) వర్జితమని చెప్పినది. (పు. ౧౬.)

గోవిందదీక్షితుఁడు మాళవగౌడను మేళముగా గ్రహింపలేదు. ఈ శు - రి, అం - గ, శు - మ, శు - ధ, కా - ని స్వరముల సంచారమునకు గుజ్జరి మేళముగా గ్రహించెను.

"గౌళరాగమును మేళముగా చేయవచ్చును. కాని అది ధైవతము లేని షాడవరాగము. కనుక గుర్జరి పరిగ్రహింపబడినది. ఆధునికులుకొందఱు ఇది సహింపరు. 'గుజ్జరిగూడ షాడవమే కదా. మాలవగౌడ ఉండగా దీనికేల మేళపట్టము?' అని వారు వాదింతురు. అది సరికాదు. గుజ్జరిగూడ పూర్ణమే. దానికవరోహమున పంచమము కలదు. మాలవగౌడ మేళము నేడు గాయకులలో అప్రసిద్ధము. కనుక అందఱికిని తెలిసిన గుజ్జరిని మేళముగా చేయదగును." అని అతడు వాదించినాడు. అప్రసిద్ధమనియైనను తండ్రి పేర్కొన్నాడు. కాని కుమారుడు వేంకటమఖి అదిగూడ చేయలేదు. అతనిమతమున ఏడు గౌళలు: గౌళ, కేదారగౌళ, ఛాయాగౌళ, రీతిగౌళ, పూర్వగౌళ, నారాయణగౌళ, కన్నడగౌళ. ఈ స్వర సంచారమునకితని మేళము గౌళయే. ఇతని గౌళగూడ ధైవతములేని షాడవమే కాని తండ్రి చేసిన ఆ ప్రశ్ననితడు గమనింపలేదు. (చతు. ప్ర. ౫ - ౩౭, ౩౯.) సంగీతసంప్రదాయ ప్రదర్శినిలో ఇతనిపేర ప్రకటించిన గీతతానములు ఇతనివే అని చెప్ప సందేహింపవలసి యున్నది,

పోలూరి గోవిందకవి రాగతాళచింతామణిలో :—

తనరన్ మాళవగౌళరాగము నిషాదన్యాస సాంశగ్రహ
స్థానమొప్పన్ రిపవర్జితౌడవరుచుల్ పొందిల్ల, వేడ్కొక్కచో
వనువొందన్ రిపసంగతం బగుచు సాయాహ్నోక్తిగేయంబు గా
యకరాజేంద్రుల చేయ నింపెసగు వయ్యా రామభూపాగ్రణీ. (౪ - ౧౦౩.)

అని కలదు. ఈ స్వరూపము ఇప్పుడు ఉత్తరదేశమువారినుండి ఎరవుగా వచ్చి మనపద్ధతిలో నిలిచిన పరజా రాగమునందెక్కువగా కానవచ్చును.

సోమనాథుడు దీనిని మేళముగా స్వీకరించి ఇందలి గాంధారము మృదుమధ్యమమని నిషాదము మృదుషడ్జమని లోతుమాటి చెప్పినాడు. (రాగవి. ౩ - ౪౦.) స్వరసంచారము విరివిగా ఇచ్చి అందు రిమ - మరి - పని - మధ అను నడకలు చూపినాడు. (౫ - ౧౧౬, ౧౧౭, ౧౧౮, ౧౧౯, ౧౨౦.)

దీనికి విరోధముగా అహోబిలుడు గౌరిమేళమందు పుట్టినది మాళవగౌళ అని, రిషభము దాని గ్రహమని, ధైవతము వర్జ్యమని, ఆరోహమున గాంధారము లేదని, 'పగపమ' అని మాత్రము ఆరోహగాంధారము రావచ్చునని శాసించెను. (సం. పారి. ప. ౪౩౦.) ఇవి ఇంచుమించు ఇప్పటి గౌరి రాగలక్షణమే యగుచున్నది.

ఎట్లును దీనికి స్వతంత్రమైన నడక సుమారు ౧౭-వ శతకమునుండి యావలనే యేర్పడినదనవచ్చును. అందు సోమనాథుని మతమే నేడును అనుసరింపబడుచున్న దనుటయు సూక్ష్మపరిశీలనచే తెలియును. గాంధారము మధ్యమముతోను నిషాదము షడ్జముతోను కలిపియే తూగును. అట్లే రిషభము షడ్జమును ధైవతము పంచమమును ఊత

గాఁగొనియే యుండును. మధ్యమము షడ్జసంవాదముతో స్వస్థానమందు రాణించును. గాంధారము దానినాశ్రయించుటకదే కారణము, గాంధారమును జూచుకొని దాని సంవాదియైన నిషాదముగూడ ఒక వన్నెయెక్కి చ్యుతషడ్జముగా అమరుచుండును.

## ౯. శుద్ధవసంతము

దత్తిల మతంగ పార్శ్వనాథులు వసంతము వట్టిదిగాని శుద్ధముగాని చెప్పలేదు. సోమనాథుఁడు పండితారాధ్యచరిత్రలో దీనిని స్మరించెను. (పు. ౪౫౫.) రత్నాకరమున హిందోలము రి - ధ లు లేనిదని, అవియుఁ గలసినప్పుడు వసంతము పుట్టుననియు చెప్పఁబడినది. (౨. ౨. ౯౬.) ఆ స్వరముల స్వరూపము తెలియదుగనుక ఆ రాగముగూడ మనకు సుగ్రహముగాదు. అహోబలుఁడు వసంతము షడ్జగ్రహమని, మధ్యమన్యాసమని, గ - ని స్వరములు తీవ్రములని చెప్పెను. కాని రి - ధ ల మాట యెత్తలేదు. సంపూర్ణరాగముగా లక్ష్యము చూపెను. (సం. పారి. ౧ - ౩౬౧.)

రామామాత్యుఁడు సాళంగనాట మేళమందు శుద్ధవసంతము జనించినదన్నాఁడు. ఆ మేళమున పంచ - రి, శుద్ధ స - మ - ప లు, పంచ - ధ, చ్యుతషడ్జని, చ్యుత మధ్యమగ, స్వరములు. శుద్ధవసంతమునకు ఆరోహమున పంచమము లేదనియు, అవరోహమున గలదనియు, గ్రహాంశన్యాసములు షడ్జమనియు తెలిపినాఁడు. (స్వ. మే. క. ౪ - ౨౩, ౫ - ౩౨.) రాగతాళచింతామణికర్తయు ఈ మతమునే అనువదించెను. (అ. ౪ - ౧౬.) పగలు నాల్గవజామున పాడఁదగినది.

పై మతమును గోవిందదీక్షితుఁడు ఖండించెను. 'దీనిని కొందఱు సాళంగనాటమేళమున చేర్చినారు, శ్రీరాగపు రి - ధ లే దీనికిని గలవని. అది సరికాదు. ఇది గుర్జరీమేళమున జనించినది: అన్యథా లక్ష్యమునకు లక్షణము విరుద్ధమగును' (సం. సుధ. ౬౧౪ - ౧౮.) ఈ లక్షణము నేఁటి 'వసంతము' నకు సరిపోవును. కాని 'శుద్ధవసంతము' వేఱు.

వెంకటమఖియే తండ్రికి ఎదురుతిరిగి శుద్ధవసంతమును శంకరాభరణజన్యముగా చెప్పెను. (చతుర్దం. ౫ - ౪౮.) దీనిలో ఆరోహమందు పంచమములేదన్న రామామాత్యుని మతము ఖండించి అప్పుడును పంచమమున్నదన్నాఁడితఁడు.

సోమనాథుని మతమున వసంతము మేళము. మాళవగౌళస్వరములే దానివి, (రాగవి. ౩ - ౩౮.) ఇది పూర్ణరాగమని, షడ్జమే దీనికి గ్రహాంశన్యాసములని, అతఁడన్నాఁడు. (౪ - ౧౨.) కనుక ఇది గోవిందదీక్షితుఁడు లక్షించిన వసంతమే.

గోవిందకవి, రామామాత్యుఁడు, వెంకటమఖి అంగీకరించిన 'శుద్ధవసంత' రాగమునందే ముత్తుస్వామిదీక్షితులు 'సోమసుందరేశ్వరం' అనుకృతి రచించినారు. త్యాగయ్యగారి కృతి యిందు కానరాలేదు. సుబ్బరామదీక్షితులు దానిని లక్షించి ఒకగీతమును సంచారియు

చూపినాఁడు. (సం. సం. ప్ర. ౯౨౯.) శంకరాభరణజన్యమై ఆరోహావరోహములు సంపూర్ణముగాఁ గలదీరాగమని స్థూలలక్షణము. విశేషప్రయోగములని ఆయన చూపిన వానిని చక్కఁగా గమనింపవలయును :

‘‘సరిగమపా - సరిమమపా - సమమగిమమపా - సమమా - సా గమగపమా - పాధనిసా - పానీధపధనిసా - సమమాధనిసా - సరిగమపమాధనిసా - సరిగమధనిసా - గమపమధమధసస్సా - రిమగమనిధసా - మనిసపధససా - గామాధాసా - ధారీసనిధప మగరిస - ధరిరిసనిసపమగరిస - ధపమగసమగరిసా - ధ నిసరిగాసా - గారీసని ధా పనిధనిపా.’

పై ప్రయోగములను పరీక్షింపఁగా మ - ధ స్వరముల పరస్పర సంవాదమిందు ముఖ్యమని తేలును. అవి రెండును స్వస్థానమున నిలిచి పంచమమును దుర్బలముగాచేయును. మధ్యమ ప్రాబల్యమును రక్షింపుటకై గాంధారము, షడ్జధైవతములతో సంవాదముగలదే యైనను, దుర్బలమగును. కనుకనే ‘రీమా’ అను సంచారము. గాంధారమువలె నిషాదముగూడ పట్టుసకోలుపోయి ‘ధసా’ అను ప్రయోగమునకవకాశమిచ్చును. గాంధారము షడ్జసంవాదమును చూపవలసినప్పుడు ‘గసా - గాఁస’ అని రిషభమును త్రోసివేయును. అసలు పంచమమే దుర్బలము గనుక విషాదమునకా యింత సౌలభ్యము కాదు లేదు. షడ్జము నుండి ధైవతమునకు జారునప్పుడు ఊఁతగా మాత్రమే అది పనికివచ్చును. ఈ తత్వమును మఱవక యెట్లు సంచరించినను రాగము చెడదు.

ఈ రాగస్వరూపమే హిందూస్థాని పద్ధతియందలి ‘మాండు’ రాగమునఁగలదు. కాని వారు దానిని ఎక్కువ చిక్కులు లేక సుబోధకరింపుకొన్నారు.

## ౧౦. సాళంగనాట

దత్తిల మతంగ పార్శ్వదేవాదులు దీని దడవలేదు. రత్నాకరమందును ఇదిలేదు. నారదుని సంగీతమకరందమున ఆహారీరాగభార్యగా ఇది కలదు. (౩ - ౬౧.) సారంగ - సాలంగ అను రెండురూపములును అందుఁగలవు (౩ - ౨౩.)

అహోబలుఁడు - నాట, నటనారాయణ, సాళంగనాట, ఛాయానాట, కామోదనాట, ఆభీరినాట, కల్యాణినాట, కేదారనాట, త్రైగిరాటీనాట. అని నవనాటలున్నవన్నాఁడు. సాళంగనాట శంకరాభరణజన్యమని, గాంధారము దీనికి లేదని, గ్రహాంశన్యాసములు షడ్జమని, మ - ధలను పలుమారు ప్రయోగింపవలెనని చెప్పినాఁడు. (స. ౪౩౭.) అతఁడిచ్చిన లక్ష్యమిది :

'స స రి మ మ ప ధ ధ ప మ ప ప మ మ రి స సా ధ స స రి రి స
మ మ ప ధ నీ ధ ప మ ప మ మ రి స సా ధ ప మ ప ధ స స రి సా'

ఇందు నిషాదము ఒకటేమారు వచ్చియుండుట గమనింపఁదగినది. మరి గాంధారము పూర్తిగా వదలిన నడకలో దానిసంవాది నిషాదమునకు అంతకంటె ఎక్కువచోటు కలిగింపలేము.

రామామాత్యుఁడు సారంగనాట (సాళంగ అనియే ప్రాఁతప్రతి) ఒక మేళముగా గ్రహించెను. పంచ - రి, శుద్ధ స - మ - పలు, పంచ - ధ, చ్యుతషడ్జ - ని, చ్యుత మధ్యమ - గ స్వరములు దానికి. (స్వ. మే - క. ౪ - ౨౦....) ఇది ఉత్తమ రాగమని (౫ - ౫) గ్రహాంశ న్యాసములు షడ్జముగాఁగల పూర్ణరాగమని అతని లక్షణము. (౫ - ౨౨.)

పై మతమునే గోవిందకవి అనుసరించెను. (రాగతా. ౪ - ౪, ౭౬.) సోమనాథుఁడు పై మేళమునకే మల్లారి యని పేరుపెట్టి, సాలంక నాట దానిలో పుట్టిన పూర్ణరాగముగా చెప్పెను. (రాగవి. ౪ - ౩౯.) లక్ష్యమును చూపలేదు.

గోవిందదీక్షితులు (పై రామామాత్యమతము సరికాదనిచెప్పి) సాలగనాటను గుజ్జరి (మాళవగౌళ) మేళములో జన్యముగా చేర్చెను. ఇందు స - ప లు వాది సంవాదులని, గ - ని లు వివాదులని, రి - ధ లు అనువాదులని కొంత వివరించెను. (సంగీ. సు. ౫౭౬.) గుర్జరిని వదలి గౌళమేళమును పేర్కొన్న వెంకటమఖి తండ్రిమాటలనే అనువదించి సారంగ నాట గౌళమేళ జన్యమని మాత్రము మార్పుచూపెను. (చతుర్ద. ౫ - ౫౭౬.)

ఈ మతమునే సుబ్బరామదీక్షితులు అనుసరించి వివరించెను. వెంకటమఖిపేరి గీతము, ముత్తుస్వామిదీక్షితుల 'అవ్యాజకరుణా' అను చిన్నకీర్తన, తన సంచారి - ప్రచురించెను. (సం. సం. ప్ర. ౧౬౯.) స రి మ ప ధ సే - సే ని ధ ప మ గ రి స - అని సంచారము. గ - ని స్వరములు వివాదులని గోవిందదీక్షితుని మతమునకు వివరణముగా ఆరోహమున ఆ రెంటిను వర్జింపఁబడినవి. ఆరోహణమున వర్జించిన స్వరములు అవరోహమందున్నను దుర్బలముగా నుండునుగాన బాధయుండదు. కాని ఇదే మేళమున ఇదే సంచారములో పుట్టిన 'సావేరి' కిని దీనికిని భేదము చూపుటయే కష్టము. కనుకనే ఈ రాగము వ్యాప్తినుండి తొలఁగినది.

సావేరిలో స - ప లు తప్ప తక్కిన ౫ స్వరములును స్వస్థానమందు నిలువక కంపితాందోళితములలో నటించును. మధ్యమము స రి గా అని చ్యుత మధ్యమముగానో, స రి మా అని చ్యుత పంచమముగానో నడచును. రి - ధ లు స - ప లను అంటియే కంపించుచుండును. గ - ని స్వరములు దుర్బలములై స రి గ రి, స రి గా రి, ప ధ ని ధ ప ధ నీ ధ అన్నప్పుడు కొంత స్వస్థానమునకు తక్కువగానే పలుకును. రి ని ధ, ని ధ మ, రి ని ద మ గ రి ని ద రీ,

ఇట్లు షడ్జ పంచమములను త్రోసి తక్కినవి విహరించును. గమకప్రధానమైన కర్ణాటక సంగీతపద్ధతిలో ఇది ప్రబలముగా వ్యాపించుట సహజమే.

స - ప లకు మాత్రమే కాక స - మ లకునుగల సంవాదమును గూడ గమనించి పాడినచో సారంగనాట రూపుగొనును. అప్పుడు మధ్యమము స్వస్థానమందు రాణించును. దానిచే రి - మ లకు స - గ సంవాదము స్ఫురించును గనుక రిషభము వాదిగా కదలక నిలుచును. దానిలో ధైవతమును ఆక్షైనడచును. గ - ని స్వరములు బలమేమియులేక ఊతకుమాత్రము పనికివచ్చును. "(స ని స) అను ప్రయోగములుగాక (స ని ధ ప) అను ప్రయోగములు ప్రాచీనగీత ప్రబంధములయందు లేవు. (మ గ రి స) అను ప్రయోగమందుగల గాంధారము నొక్కు, లేక ఒరయుటలో ఋషభమునకు దిగుట ప్రాచీన సంప్రదాయజ్ఞుల వాడుకగా నున్నది" అని సు. రా. దీక్షితులు చెప్పుటకిదే హేతువు. స ని స ధ ప అను సంచారమునకు తోడుగా మ గ మ గ రి అను సంచారమును నైసర్గికముగా శోభించును. ఈ సంపుటమందలి ౨ కీర్తనలు ఈ రాగమందే పొదిగినవి.

రామామాత్యుడు సాళంగనాట పేరొకటైనను వేఱు రాగమనుట స్పష్టము. కాని తచ్చూరి సింగరాచార్యసోదరులు సారంగనాట, సాళంగనాట యని రెండు వేఱురాగాలు పేర్కొని, మాయామాళవగౌళమేళమందే చేర్చి, అందు సారంగనాటకు స రి మ ప ధ స - స ని స ధ ప మ గ రి స' అనియు, సాళంగనాటకు 'స రి స మ ప ధ స - స ధ ప స ని స ధ ప మ గ రి స' అనియు సంచారమును చూపినారు: (గాయకలోచనం. ౫౨, ౫౩.) పేరులోని ర - ల భేదమును ప్రాచీనులు గమనింపలేదు. మరి పై సంచారములలోని స్వర భేదమును మనము గమనింపలేము.